




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 93, పేజీలు - 08

ఆదివారం, సెప్టెంబర్ 7, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## గంగ ఒడికి ఖైరతాబాద్
# విశ్వశాంతి మహాశక్తి గణపతి

**- ఘనంగా ముగిసిన మహా నిమజ్జనం - భారీగా తరలివచ్చిన భక్తజనం**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఖైరతాబాద్ బడా గణేశుని నిమజ్జన శోభాయాత్ర 2 భక్తి ఉత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. 69 అడుగుల ఎత్తైన విశ్వశాంతి మహాశక్తి గణపతి విగ్రహం నిమజ్జన శోభాయాత్ర నిర్విఘ్నంగా పూర్తి అయింది. 71వ ఏడాది జరుపుకుంటున్న ఈ గణేశోత్సవం, లక్షలాది భక్తులను ఆకర్షించింది. హుస్సేన్ సాగర్ సరస్సులో నిమజ్జనం కోసం ఈ శోభాయాత్ర ఉదయం 7:44 గంటలకు ఖైరతాబాద్ మండపం నుంచి బయలుదేరింది. మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో క్రేన్ నెంబర్ 4 వద్ద నిమజ్జనం పూర్తి అయింది. లక్షలాది మంది భక్తులు గణేశుడికి వీడ్కోలు పలికారు. గంగమ్మఒడికి సాగనంపారు. ఈ ఏడాది ఖైరతాబాద్ గణేశుడు 69 అడుగుల ఎత్తుతో "విశ్వశాంతి మహాశక్తి గణపతి" థీమ్‌తో రూపొందించారు. విగ్రహం చుట్టూ పూరీ జగన్నాథ్ స్వామి, లలితా త్రిపుర సుందరి, లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి, గజ్జలమ్మ దేవత విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇవి శోభాయాత్రకు అదనపు ఆకర్షణను జోడించాయి. శోభాయాత్ర ఖైరతాబాద్ మండపం నుంచి సెక్రటేరియట్, అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ మీదుగా హుస్సేన్ సాగర్‌లోని క్రేన్ పాయింట్ నంబర్ 4 వద్దకు చేరుకున్న తరవాత నిమజ్జనం పూర్తి అయింది. శోభాయాత్ర ఉదయం 6:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, శుక్రవారం రాత్రి భక్తుల భారీ రద్దీ కారణంగా వెల్డింగ్ పనులు ఆలస్యమవడంతో గంట విళంబంగా 7:44 గంటలకు బయలుదేరింది. "గణపతి బప్పా మోరియా" నినాదాలు, డప్పు చప్పుళ్లు, సాంప్రదాయ నృత్యాలతో శోభాయాత్ర ఉత్సాహకర వాతావరణంలో సాగింది. రోడ్ల వెంట, ఇళ్ల పైకప్పులపై భక్తులు ఫోటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అయితే అనుకున్న సమయానికే నిమజ్జనం పూర్తి చేసేందుకు వేగంగా యాత్రను కొనసాగించారు. శోభాయాత్ర 2.5 కిలోమీటర్ల దూరంలో హుస్సేన్ సాగర్‌లోని నిమజ్జన పాయింట్‌కు మధ్యాహ్నం 1 గంటలకు చేరుకుంది. ఒకటిన్నరకల్లా నిమజ్జనంపూర్తి అయింది. ఈ ఏడాది ఖైరతాబాద్ గణేశ విగ్రహం సహజ మట్టి, సేంద్రీయ రంగులు, గడ్డి ఊకతో రూపొందించారు. ట్యాంక్ బండ్ పై మొత్తం 134 స్టాటిక్ క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు నిమజ్జన ప్రక్రియ కోసం ఏర్పాటు చేశారు. హుస్సేన్ సాగర్‌లో సుమారు 50,000 విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి, ఈ ప్రక్రియ 40 గంటలపాటు కొనసాగుతుందని అధికారులు అంచనా వేశారు. హుస్సేన్ సాగర్‌తో పాటు 20 ప్రధాన సరస్సులు, 72 కృత్రిమ కొలనులలో నిమజ్జనం జరిగేలా జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేసింది,

2లో..

## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ కీలక భేటీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో ద్రౌపది ముర్ముతో ప్రధాని మోదీ సమావేశం అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ జపాన్, చైనా పర్యటనల అనంతరం జరుగుతున్న భేటీ కావడంతో విదేశీ పర్యటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని మోదీ చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే భారత్– అమెరికా వాణిజ్య సంబంధాలు, భారత్ పై సుంకాలు విధింపు తదితర అంశాలనూ ప్రస్తావించినట్లు సమాచారం. అలాగే దేశవ్యాప్తంగా వరదలు ముఖ్యంగా పంజాబ్ లో ఆకస్మిక వరదలపైనా ద్రౌపది ముర్ముతో ప్రధాని మోదీ చర్చించినట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం అయ్యారు. సెప్టెంబర్ 6 సాయంత్రం ఢిల్లీలోనే రాష్ట్రపతి భవన్ లో ద్రౌపది ముర్ముతో ప్రధాని మోదీ సమావేశం అయ్యారు. ఈ భేటీలో జపాన్, చైనా పర్యటన తర్వాత రాష్ట్రపతి, ప్రధాని మోదీ మధ్య జరుగుతున్న సమావేశం కావడంతో ఈ భేటీ ప్రత్యేకతను సంతరించుకుంది. చైనాలోని తియాంజిన్ వేదికగా జరిగిన ఎస్సీఓ సమావేశంలో ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ లతో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఇరు

2లో..

# అసెంబ్లీకి జగన్

**- అనర్హత వేటు తప్పించుకోవడానికేనా.?**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవి నాలుగో సమావేశాలు.

అయితే ఈ సమావేశాలకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి హాజరవుతారని ప్రచారం నడిచింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఆయన సమావేశాలకు హాజరైతే మంచిదని వైసీపీ సీనియర్లు సలహా ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఆయన పై ఒత్తిడి చేస్తున్నట్లు టాక్ నడిచింది. మరోవైపు ఈ సమావేశాలకు హాజరు కాకుంటే నిబంధనల మేరకు వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని కూటమి నేతల నుంచి వినిపించింది. త్వరలో పులివెందులకు ఉప ఎన్నిక రాబోతుందని జగన్ శాసనసభ సమావేశాలకు హాజరు కాకుంటే జరిగేది అదేనని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎటువంటి

2లో..

## గణేష్ నిమజ్జనాలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

**గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గణేష్ నిమజ్జనం వేడుక సందర్భంగా ప్రజలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి షాకిచ్చారు. ఆయన హుస్సేన్ సాగర్ వద్దకు గణేష్ విగ్రహాల నిమజ్జనాలను స్వయంగా పరిశీలించారు. గణేష్ శోభాయాత్రలు, నిమజ్జనం వేడుకల్లో వేలాదిగా తరలివచ్చి పాల్గొంటున్న భక్తులు, సందర్శకులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదికపై నుంచి భక్తులకు రేవంత్ రెడ్డి అభివాదం చేశారు. 'గణపతి

2లో..

## ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో
# హరీష్ రావు సమావేశం

**- కవిత ఆరోపణలపై చర్చ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో శనివారం ఉదయం పార్టీ కీలక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు (కేటీఆర్), మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శంబిపూర్ రాజు, మాజీ మంత్రి టి. హరీశ్ రావు పాల్గొన్నారు. తెలంగాణ రాజకీయాల్లో తాజా పరిణామాలు, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి.

**ఎమ్మెల్సీ పోచంపల్లిని కూడా పిలిపించడంతో కవిత ఆరోపణలపైనే చర్చిస్తున్నట్లు సమాచారం**

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ సమావేశంలో కేటీఆర్ ఉదయం నుంచి ఉండగా, లక్ష్మారెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శంబిపూర్ రాజు వరుసగా కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు కాస్త ఆలస్యంగా ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. తెల్లవారుజామునే ఆయన లండన్ నుంచి హైదరాబాద్ వచ్చారు. కవిత చేసిన ఆరోపణలపై ప్రధానంగా చర్చించినట్లుగా తెలుస్తోంది. సంతోష్ రావుతో కలిసి

2లో..

## కవిత జాగృతిలోకి మొదలైన చేరికలు

2లో..




నా ప్రస్థానం
## తెరిచిన పుస్తకం

2లో..



## కీర్తి రిచ్‌మౌండ్ విల్లా లడ్డూ @2.32 కోట్లు

2లో..



## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు హైకోర్టు షాక్

**- మాజీ ఐఏఎస్ పిటిషన్‌పై ఈ 8న విచారణ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు హైకోర్టులో షాక్ తగిలింది. ఆయనపై దాఖలైన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు విచారణకు స్వీకరించడంతో ఈ వ్యవహారం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కళ్యాణ్ సినిమాల్లో నటించడం, ప్రభుత్వ నిధులు, భద్రతా సిబ్బంది, అధికార వాహనాలను సినిమా ప్రమోషన్‌కు వినియోగించడం రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ ఆగస్టు 19న దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ పదవిలో కొనసాగుతూనే సినీ కార్యక్రమాల్లో పాల్గొనడం అనైతికమని, ఆయనపై స్వతంత్ర దర్యాప్తు ఆదేశించాలని పిటిషన్‌లో

2లో..

## హైదరాబాద్‌లో రూ.30 వేల కోట్ల డ్రగ్స్ ఫ్యాక్టరీ గుట్టురట్టు

2లో..



## కమీషన్ల దురాశతోనే
## కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ చేపట్టారు

- పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం భారీ అవినీతికి పాల్పడిందన్న పొంగులేటి
- కమీషన్లు రావనే డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టలేదని ఆరోపణ
- రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని మండిపాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే భారీగా కమీషన్లు వస్తాయన్న దురాలోచనతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ ప్రాజెక్టును చేపట్టారని, అదే పేదలకు ఇళ్లు కట్టిస్తే కమీషన్లు రావన్న కారణంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని

2లో..

# బాలాపూర్ లడ్డూ @35 లక్షలు

**- లడ్డూను దక్కించుకున్న దశరథ్ గౌడ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రతి ఏటా ఎంతో ఆసక్తి రేకెత్తించే బాలాపూర్ గణపతి లడ్డూ వేలం ఈసారి కూడా కొత్త రికార్డు నెలకొల్పింది. తన పాత రికార్డును తానే బద్దలు కొడుతూ ఈ ఏడాది ఏకంగా రూ. 35 లక్షల భారీ ధర పలికింది. వినాయక చవితి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ లడ్డూ వేలం పాట ఉత్కంఠభరితంగా సాగింది. హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌కు చెందిన

2లో..

## ఎరువుల లభ్యతపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

**- అధికారులకు కీలక ఆదేశాలు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో రైతులు ఎరువుల కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, వాటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎరువుల లభ్యత, సరఫరా అంశంపై ఆయన శనివారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎరువుల నిల్వలపై సమీక్షించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం

2లో..

### గంగ ఒడికి ఖైరతాబాద్

# విశ్వశాంతి మహాశక్తి గణపతి

దీనివల్ల సహజ జలవనరులపై ఒత్తిడి తగ్గింది. ఖైరతాబాద్ బడా గణేశుని నిమజ్జన శోభాయాత్ర హైదరాబాద్‌లో భక్తి, సాంస్కృతిక సంబరాలకు ప్రతీకగా నిలిచింది. లక్షలాది భక్తులు, భారీ భద్రత, పర్యావరణ హిత ఏర్పాట్లతో ఈ ఉత్సవం దేశవ్యాప్తంగా ఆదర్శనీయంగా మారింది. ఈ శోభాయాత్ర హైదరాబాద్ యొక్క సామాజిక, సాంస్కృతిక ఐక్యతను ప్రతిబింబిస్తూ, భక్తులకు మరపురాని అనుభవాన్ని అందించింది.

## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ కీలక భేటీ

దేశాలతో పలు కీలక అంశాలపై ప్రధాని మోదీ చర్చించారు. అంతకుముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ తో ప్రధాని మోదీ సమావేశం అయ్యారు. అనంతరం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అధ్యక్షుడు మాక్రాన్ తో వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారంలో పురోగతిపై సమీక్ష జరిపామని తెలిపారు. ఉక్రెయిన్ లో వివాదాన్ని త్వరగా ముగించే ప్రయత్నాలు సహా అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై అభిప్రాయాలను మార్పిడి చేసుకున్నామని వివరించారు. ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని పెంపొందించడంలో భారత్- ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తూ ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# అసెంబ్లీకి జగన్

చలనం లేదు.

### ప్రతిపక్ష హోదా సాకుతో..

గడిచిన ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం అయ్యింది. అందుకే నిబంధనల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కలేదు. జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. అయితే ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే తాను అసెంబ్లీకి రానని తెగేసి చెప్పారు జగన్మోహన్ రెడ్డి. అన్నట్టుగానే గత మూడు సమావేశాలకు ఆయన హాజరు కాలేదు. ఈసారి కూడా ఆయన అసెంబ్లీకి వచ్చేలా లేరు. జగన్ సహా ఎమ్మెల్యేలు ఎవరు అసెంబ్లీలో అడుగు పెట్టడానికి ఇష్టపడుతున్నట్టుగా లేరు. దీంతో వీరందరిపై నిబంధనల ప్రకారం అనర్హత వేటు పడుతుందా.? ఏం జరుగుతుంది.? అనే చర్చ నడుస్తోంది. అయితే ఒకవేళ ఉప ఎన్నిక వస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎదుర్కోగలదా.? అంటే మౌనమే సమాధానం అవుతోంది.

### చంద్రబాబుకు ఎదురైన పరిణామాలు..

2019లో అధికారంలోకి వచ్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. నాడు 23 స్థానాలకే పరిమితం అయింది తెలుగుదేశం. సుదీర్ఘకాలం సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు హుందాగా సభకు వచ్చారు. నాటి గవర్నర్ ప్రసంగం వినడమే కాదు స్పీకర్ తమ్మినేని సీతారాం ఎంపిక సమయంలో సైతం ప్రతిపక్ష గౌరవ పాత్ర పోషించారు. అయితే నాడు చంద్రబాబును టార్గెట్ చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు రెచ్చిపోయారు. కానీ చంద్రబాబు వాటన్నింటినీ తట్టుకొని శాసనసభలో నిలబడ్డారు. అయితే ఆయన కుటుంబం పై దాడి, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా కామెంట్స్ చేశారు. దీంతో ఆ వయసులో కూడా చంద్రబాబు ఏమీ చేయలేక బోరున ఏడ్చేశారు. ఇప్పుడు చంద్రబాబుకు ఎదురైన అవమానాలన్నీ జగన్మోహన్ రెడ్డికి అనుభవమే. ఎందుకంటే నాడు శాసనసభలో ఆయన కూడా ఉన్నారు. అందుకే ఇప్పుడు ప్రతిపక్ష హోదాను అడ్డం పెట్టుకొని ఇవ్వలేదని సాకు చూపి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు. ఇప్పుడు నిబంధనల ప్రకారం 60 రోజులు సెషన్స్కు హాజరు కాకపోతే అనర్హత వేటు పడుతుందన్న భయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వెంటాడుతోంది. అయితే అనర్హత వేటు ద్వారా సానుభూతి పొందుతామని కానీ సభకు వెళ్లే ప్రసక్తి లేదని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెబుతున్నారు. కానీ ఓ ఆరుగురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు.. సభకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే ఇంకా సమయం ఉండడంతో దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటన జారీ చేసే అవకాశం ఉంది. ఆ ప్రకటన ఎలా ఉండబోతుందో చూడాలి.

### గణేష్ నిమజ్జనాలను

# పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

బప్పా మోరియా' అంటూ భక్తులతో కలిసి నినాదాలు చేసి వారిలో ఉత్సహాన్ని నింపారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి ఉండి గణేష్ నిమజ్జన వేడుకల్ని స్వయంగా పరిశీలించడానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి భక్తులతో కలిసి నినాదాలు చేయడం అందర్నీ ఆకట్టుకుంది. ముందస్తు సమాచారం లేకుండా సాధారణ భక్తుడిలాగ సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్షం కావడంతో నిమజ్జనానికి వచ్చిన భక్తులు ఆశ్చర్యపోయారు. ట్యాంక్ బండ్ వద్ద క్రేన్ నెం.4వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జనాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రతిష్టాత్మక గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను హైదరాబాద్ కలెక్టర్ హరిచందన సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. నిమజ్జనాల సందర్భంగా విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. గణేశ్ నిమజ్జనాలు జరుగుతుండగా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా హుస్సేన్ సాగర్ వద్దకు వచ్చి ఏర్పాట్లను పరిశీలించడంపై భాగ్యనగర్ ఉత్సవ్ సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో హరీష్ రావు సమావేశం

పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి భారీ అవినీతికి పాల్పడ్డారని మోకిలా వద్ద రూ.750కోట్ల విల్లా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో పోచంపల్లిని కూడా ఫామ్ హౌస్ కు పిలిపించడం ఆసక్తికరంగా మారింది.

### కాళేశ్వరం పై సీబీఐ విచారణపైనా తదుపరి వ్యూహం ఖరారు

అదే సమయంలో కాళేశ్వరం అంశంపైనా చర్చించినట్లుగా తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటోంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోస్ కమిషన్ రిపోర్టు పై సీబీఐ విచారణ జరగనుంది. సీబీఐ డైరెక్టర్ స్వయంగా హైదరాబాద్ రావడంతో సీరియస్ గా విచారణ జరుగుతుందని అనుకుంటున్నారు. ఇది పూర్తిగా కాళేశ్వరం పై జరుగుతున్న కుట్రగా రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ నాయకులకు సూచిస్తున్నారు. బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత సమావేశాలు నిర్వహించి, పార్టీ కార్యకర్తల ఉత్సాహాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం.

### కవిత పార్టీ పెడితే ఎలా ఎదుర్కోవాలన్న అంశంపైనా చర్చలు

కవిత సొంత పార్టీ పెట్టే అవకాశాలపై కూడా చర్చించారు. కవిత పార్టీ పెడితే అనుసరించాల్సిన వ్యూహంపైనా ఓ అభిప్రాయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం అనేక సవాళ్లను ఎదుర్కోంటోంది. కానీ బీఆర్ఎస్ అంతర్గత రాజకీయాలతో సమస్యలను ఎదుర్కోటోంది. వీటికి ఎక్కువ ప్రాధాన్యత రాకుండా ఉండాలంటే కవితను తక్కువగా టార్గెట్ చేసుకుని ప్రభుత్వాన్ని ఎక్కువగా విమర్శించాలన్న అభిప్రాయం వినిపించింది. ఈ సమావేశం సుదీర్ఘంగా సాగే అవకాశాలు ఉన్నాయి.

### హైదరాబాద్‌లో రూ.30 వేల కోట్ల

# డ్రగ్స్ ఫ్యాక్టరీ గుట్టురట్టు

**- మత్తు పదార్థాలు సీజ్ చేసిన ముంబై పోలీసులు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ వ్యాప్తంగా గణేశ్ శోభాయాత్రలు, వినాయక నిమజ్జనాల వేడుకలు జరుపుకుంటుంటే రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడే ఘటన చోటుచేసుకుంది. మేడ్చల్ జిల్లాలో భారీ స్థాయిలో నిషేధిత మాదక ద్రవ్యాల తయారీ జరుగుతున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. కుత్బుల్లాపూర్‌లో ఉన్న ఒక ఫ్యాక్టరీపై మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దాడులు నిర్వహించి ఏకంగా 32,000 లీటర్ల మిథైలెనెడియాక్సీ మెథాంఫెటమైన్ ముడిసరకును స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫ్యాక్టరీలో మత్తు పదార్థాలు తయారీ చేస్తున్న 13 మంది నిందితులను అరెస్ట్ చేశారు. కుత్బుల్లాపూర్ లోని ఫ్యాక్టరీలో తయారైన డ్రగ్స్‌ను దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. 'మోలీ', 'ఎక్స్‌టీసీ' వంటి పేర్లతో తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు మహరాష్ట్ర పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన నిందితులను ముంబయికి తరలించే చర్యలు చేపట్టారు. మరోవైపు ఈ కేసులో మేడ్చల్ పోలీసులు కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాలు అనేవి లేకుండా చేస్తామని ప్రభుత్వం చెబుతుంటే.. ఒక్కసారిగా వేల లీటర్ల మత్తు పదార్థాలను సీజ్ చేయడం హాట్ టాపిక్ అవుతోంది. అది కూడా మహారాష్ట్ర నుంచి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు వచ్చి దాడులు చేస్తే ఫ్యాక్టరీలో డ్రగ్స్ తయారీ విషయం బయటకు వచ్చింది. పోలీసులు సీజ్ చేసిన మత్తు పదార్థాల విలువ ఎంత

## కమీషన్ల దురాశతోనే కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ చేపట్టారు

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కల్వకుంట్ల కుటుంబం వారి పదేళ్ల పాలనలో భారీ అవినీతికి పాల్పడిందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ఆ అప్పులకు తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెలా వడ్డీలు కడుతూనే, మరోవైపు సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళుతోందని స్పష్టం చేశారు.పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, పేదలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని పొంగులేటి ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 7 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, పాత కార్డులలో 17 లక్షల మంది పేర్లను చేర్చామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సర్కారు ఏటా రెండు వేల ఇళ్లు కట్టినా పదేళ్లలో అర్హులందరికీ ఇళ్లు అందేవని, కానీ వారికి ఆ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో మూడు విడతలుగా రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు హైకోర్టు షాక్

అభ్యర్థించారు.

### ప్రభుత్వ న్యాయవాది పలు అభ్యంతరాలు

ఈ మేరకు గత నెలలో మొదటిసారి విచారణ జరిగిందని, తదుపరి విచారణలో రాష్ట్ర హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చడాన్ని ఆమె ప్రశ్నించారు. కాగా, న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప్, కేసు విచారణ జాబితాలో సీబీఐ, ఏసీబీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పేర్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ పేర్లు చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించి, విచారణను వాయిదా వేశారు.

### పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకుంటారా.. తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ

తాజాగా, హైకోర్టు ఈ కేసును సెప్టెంబర్ 8న విచారించనున్నట్లు ప్రకటించింది. దీనిపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. నేరం రుజువైతే పవన్ కల్యాణ్‌పై చర్యలు తప్పవా అనే చర్చ జరుగుతోంది. ఇక సోమవారం జరిగే విచారణలో ఏం జరగబోతుందన్న విషయంపై ఏపీతో పాటు తెలంగాణలోనూ ఉత్కంఠ నెలకొంది. హరిహర వీరమల్లు సినిమా ప్రమోషన్లు, ఈవెంట్ సందర్భంగా ప్రభుత్వ వాహనాలతో పాటు భద్రతా సిబ్బందిని వినియోగించారని విజయ్ కుమార్ తన పిటిషన్లో పేర్కొన్నారు. విచారణ చేపట్టి పవన్ కళ్యాణ్ పై చర్యలు తీసుకోవాలని మాజీ ఐఏఎస్ ఏపీ కోర్టును ఆశ్రయించారు. హరిహర వీరమల్లు సినిమా ప్రమోషన్లు, విడుదల సమయంలో హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రయాణించిన వాహనంపై ఏపీ డిప్యూటీ సీఎం అని రాసి ఉండటం సైతం వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. అయితే ఆ వాహనానికి ఏపీ డిప్యూటీ సీఎం అధికారిక వాహనాలకు ఏ సంబంధం లేదని అదే సమయంలో క్లారిటీ ఇచ్చారు.

## ఎరువుల లభ్యతపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

రాష్ట్రవ్యాప్తంగా 77,396 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనికి అదనంగా, ఆదివారం కాకినాడ పోర్టుకు చేరుకోనున్న నౌక ద్వారా మరో 15 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రాబోయే 10 రోజుల్లో అదనంగా మరో 41 వేల టన్నుల ఎరువుల నిల్వలు రాష్ట్రానికి రానున్నాయని వెల్లడించారు.

దీంతో ఎరువుల కొరత అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఎరువుల సరఫరా వ్యవస్థలో ఎలాంటి లోపాలు ఉండకూడదని నొక్కిచెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నుంచి జిల్లా కలెక్టర్ల వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు ఎరువులు సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి, రైతులకు అండగా నిలవాలని ఆయన సూచించారు.

# బాలాపూర్ లడ్డూ @35 లక్షలు

లింగాల దశరథ్ గౌడ్ ఈ ప్రతిష్ఠాత్మకమైన లడ్డూను దక్కించుకున్నారు. ఈ ఏడాది జరిగిన వేలం పాటలో మొత్తం 38 మంది పోటీ పడ్డారు. హోరాహోరీగా సాగిన ఈ వేలంలో చివరికి దీనిని దశరథ్ గౌడ్ దక్కించుకున్నారు. గతేడాది ఈ లడ్డూ రూ. 30.01 లక్షలకు అమ్ముడుపోగా, ఆ రికార్డును ఈ సంవత్సరం సునాయాసంగా అధిగమించింది. గతేడాది కొలను శంకర్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

కాగా, బాలాపూర్ లడ్డూ వేలం సంప్రదాయం 1994లో ప్రారంభమైంది. అప్పట్లో కేవలం రూ. 450తో మొదలైన ఈ వేలం ప్రస్థానం, దశాబ్దాలు గడిచేసరికి లక్షల్లోకి చేరి ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ లడ్డూను దక్కించుకుంటే శుభం కలుగుతుందని, వ్యాపారంలో వృద్ధి ఉంటుందని భక్తులు బలంగా విశ్వసిస్తారు. అందుకే ప్రతి సంవత్సరం పోటీ తీవ్రంగా ఉంటుంది.

# నా ప్రస్థానం తెరిచిన పుస్తకం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై ఇటీవల కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన విషయం విదితమే. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆమె ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కవిత శ్రేణుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది.

కవిత చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందిస్తూ, తనపై ఆరోపణలు చేస్తున్న వారి విజ్ఞతకే దానిని వదిలివేస్తున్నానన్నారు. ఉద్యమం నుంచి 25 ఏళ్లుగా తన ప్రస్థానం తెరిచిన పుస్తకమని ఆయన అన్నారు. ఇటీవల తనపైనా, పార్టీపైనా కొందరు ఆరోపణలు చేశారని, అయితే అవి ఎందుకు చేశారో, ఎవరి లబ్ధికోసం చేశారో వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నానని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇదే క్రమంలో రేవంత్ రెడ్డి సర్కార్ పైనా హరీశ్ రావు విమర్శలు చేశారు.

కేసీఆర్ గత పదేళ్లుగా నిర్మించిన ఒక్కో వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు రాష్ట్రంలో రైతులు యూరియా దొరకక ఇబ్బంది పడుతుంటే ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడమే తమ ముందున్న కర్తవ్యమని హరీశ్ రావు అన్నారు.

# కీర్తి రిచ్‌మౌండ్ విల్లా

# లడ్డూ @2.32 కోట్లు

**- ఈ గణేషుడు యమ రిచ్ గురూ**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బొజ్జ గణపయ్య చేతిలోని లడ్డూకు ఎంత డిమాండ్ ఉంటుందో హైదరాబాద్ ప్రజలు తెలియజేస్తున్నారు. ఇప్పటికే నగరంలో పలుచోట్ల వినాయకుడి చేతిలో పూజలందుకున్న లడ్డూలను వేలంపాటలో లక్షలాది రూపాయలకు కొనుగోలు చేసిన సంఘటనలు చూశాం. కానీ ఇప్పుడు అది కోట్లకు చేరింది

హైదరాబాద్ లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటుచేసిన గణపతి చేతిలోని లడ్డూ ఏకంగా రూ.2.32 కోట్లు పలికింది. ఇది గణపతి లడ్డూ వేలంలోనే ఆల్ టైమ్ రికార్డుగా చెప్పవచ్చు. రాజేంద్రనగర్ పరిధిలోని కీర్తి రిచ్ మండ్ విల్లా గత కొన్నేళ్ళుగా బాలాపూర్ లడ్డూతో పోటీ పడుతున్న విషయం. గతేడాది కూడా ఇక్కడే అత్యధిక ధరకు లడ్డూను సొంత చేసుకున్నారు. ఈసారి వేలంలో ఏకంగా రూ.2.32 కోట్లకు గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు బాల్ గణేష్ టీం సభ్యులు. గణపతి లడ్డూ ఇంత భారీ ధర పలకడంతో ఈ రిచ్ మండ్ విల్లా ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది.

గత నాలుగైదు సంవత్సరాలుగా కీర్తి రిచ్ మండ్ విల్లాలో నిర్వహించే వినాయక లడ్డూ వేలంపాట చర్చనీయాంశంగా మారుతోంది. 2023 లో రూ.1.26 కోట్లు పలికింది గణపతి లడ్డూ ఇక గతేడాది అంటే 2024 లో ఇది మరికొంత పెరిగి రూ.1.87 కోట్లు పలికింది. ఇవే అత్యధికం అనుకుంటే ఈసారి గణపతి లడ్డూ ధర మరింత పెరిగి రెండుకోట్లు దాటడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

# కవిత జాగృతిలోకి మొదలైన చేరికలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను దారుణంగా మోసం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని, చట్టసవరణ పేరుతో నాటకాలాడుతోందని ఆమె ఆరోపించారు. శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో పలువురు బీసీ సంఘాల నాయకులు కవిత సమక్షంలో జాగృతిలో చేరారు. జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, అరె కటిక సంఘం నేత సురేందర్ తమ అనుచరులతో కలిసి జాగృతి తీర్థం పుచ్చుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కవిత చేస్తున్న పోరాటానికి మద్దతుగా తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం పొందేందుకు ఈ ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళతామని అసెంబ్లీలో హామీ ఇచ్చి మాట తప్పారని గుర్తు చేశారు. ఒకవైపు కేంద్రం వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉండగా, మరోవైపు కేబినెట్ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపడం బీసీలను మభ్యపెట్టడానికేనని ఆమె అన్నారు. గవర్నర్ బిల్లులను తొక్కిపెట్టినా, ప్రభుత్వం న్యాయపోరాటం చేసి ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేయలేదని విమర్శించారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు తమ ఉద్యమం ఆగదని కవిత స్పష్టం చేశారు. త్వరలోనే బీసీ సంఘాల నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు.

## ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ఘన సన్మానం



**సిద్దిపేట్ (ప్రశ్న న్యూస్)** సమాజంలో గురువు స్థానం విశిష్టమైనది జక్కాపూర్ తాజా మాజీ సర్పంచ్ దుర్గం పరిశురాములు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జక్కాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం నిర్వహించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో పాటు వినయం సంస్కారము నేర్పేది వ్యక్తి నిర్మాణం చేసే విశిష్టమైన వ్యక్తులు ఉపాధ్యాయులని అన్నారు. జక్కాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాష్ట్ర జిల్లా స్థాయి ర్యాంకులు సాధిస్తూ జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించడానికి విశేషంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ సన్మానించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షౌకత్ అలీ మాట్లాడుతూ తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని సంస్కారంతో కూడిన విద్య సమాజంలో వెలుగు నింపుతుందని విద్యార్థులకు సూచించారు. జక్కాపూర్ గ్రామంలో ప్రజా ప్రతినిధులు విశేషంగా భాగస్వాములై ఉత్తమ ఫలితాలు సాధనలో పాలుపంచుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మట్టె బాల్ రెడ్డి, మరియు మాకిల శ్రీనివాసరెడ్డి, మట్టి రాజు, రాగుల మహేష్, ఎర్రం భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### నాగారంలో ఘనంగా

# గణేష్ నిమజ్జనం వేడుకలు



నాగారం ( ప్రశ్న న్యూస్) నాగారం మున్సిపల్ పరిధిలో వివిధ కాలనీల నుండి వివిధ ప్రాంతాల నుండి గణేష్ నిమజ్జనానికి చేరుకున్న గణనాథులు ఘనంగా స్వాగతం పలికిన మున్సిపల్ అధికారులు. దేశంలో ప్రతి ఒక్కరు ప్రతి సందర్భాల్లో మొదట పూజ చేసే గణేశుని పండుగ దేశమంతా పెద్ద ఎత్తున అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రులు జరుపుకొని, భక్తులు భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు పూజలు నిర్వహించి ప్రసాదాలు పెట్టి గణేష్ ని కృపకు పాత్రులు అవుతూ గణేశుని నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అందులో భాగంగానే నాగారం మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు మండల రెవెన్యూ అధికారులు కలసి ఏర్పాటు చేసిన నిమజ్జనం రాంపల్లి చెరువుకు దగ్గరలో ఉన్న ప్రాంతాలలో నుండి రాంపల్లి చెరువుకు పెద్ద ఎత్తున గణనాథులు వచ్చారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణేష్ నిమజ్జనం ఏర్పాటు చేశామని మునిసిపల్ అధికారులు తెలిపారు. నిమజ్జనానికి వచ్చిన గణేషులను వెంటనే నిమజ్జనం చేయడం జరుగుతుందని ఎలాంటి ఆలస్యం లేకుండా ఇబ్బందులు కలాగకుండా నిమజ్జనం కొనసాగుతుందని మునిసిపల్ సిబ్బంది తెలిపారు.

## మగ్దుంపల్లిలో హనుమాన్ మందిర్ వినాయకుడి నిమజ్జనం

ఆందోల్, : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మగ్దుంపల్లి గ్రామంలో హనుమాన్ మందిర్ వినాయకుడి నిమజ్జనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం పాటలో ఎంపల్లి శివశంకర్ రూ. 30,001, మర్పల్లి వీరన్న రూ. 25,001, గులాంరసూల్ రూ. 15,001, నాయికిని తుల్జాదాస్ రూ. 11,001, సార నాగన్న రూ. 11,001, వనంపల్లి సంగయ్య రూ. 7,001లకు లడ్డూలను కైవసం చేసుకున్నారు. ఈ వేలం పాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 11వ రోజు పండ్లతో అలంకరణ

పటాన్‌చెరు, : పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గణేష్ గడ్డ ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం బ్రహ్మోత్సవాల 11వ రోజున, స్వామివారిని వివిధ రకాల పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### మంత్రి పొంగులేటి ప్రారంభోత్సవానికి

# ముస్తాబైన ఇందిరమ్మ ఇల్లు

దేవరకద్ర, : మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభోత్సవానికి ఉప్పరిపల్లి ప్రమీల చెందిన ఇందిరమ్మ ఇల్లు ముస్తాబయింది. నేటి మధ్యాహ్నం మంత్రులు దామోదర రాజనర్సింహ,జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించనున్నారు. దీంతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు అందుబాటులోకి రానున్నాయి.

## ఈ అలవాట్లు మీ జీవితాన్నే

# మార్చేస్తాయి..!

ఉదయం ఎలా మొదలుపెడితే ఆ రోజు అంతా మన ఆలోచనలు శరీర స్థితి దానిపై ఆధారపడి ఉంటాయి. రోజూ ఉండే ఒత్తిళ్లు, నిద్రలేమి లాంటి సమస్యల నుంచి బయటపడటానికి కొంత సమయం మనకు మనమే కేటాయించుకోవాలి. ఉదయాన్నే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తే శరీరం మనసు రెండూ ఉల్లాసంగా ఉండగలవు. రాత్రిపూట 5 నుంచి 7 తులసి గింజలను నీటిలో నానబెట్టండి. ఉదయం ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగండి. ఇవి శరీరానికి తేమను చక్కగా సమతుల్యం చేస్తాయి. యాంటీఆక్సిడెంట్ లక్షణాల వల్ల శరీరంలోని వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ పద్ధతి మీ రోజును బాగా ప్రారంభించడంలో సహాయపడుతుంది. ఉదయాన్నే ఫోన్ చూస్తే మనసుకు ప్రశాంతత లేకుండా మారుతుంది. చుట్టూ జరుగుతున్న వార్తలు, సోషల్ మీడియా నోటిఫికేషన్లు మన ఉదయాన్ని తొందరగా ఆందోళనలోకి నెడతాయి. మొదటి 30 నిమిషాలు మొబైల్ కు దూరంగా ఉండండి. దానికి బదులుగా పచ్చని చెట్ల మధ్యలో కాసేపు నిశ్శబ్దంగా కూర్చోవచ్చు లేదా ప్రశాంతంగా మౌనంగా ఉండండి. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని ఉదయం తాగడం ద్వారా శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపించవచ్చు. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉదయాన్నే వేడి నీరు తాగడం మన శరీరానికి ఒక సహజ డిటాక్స్ ప్రక్రియగా పని చేస్తుంది. రోజంతా శక్తిగా ఉండాలంటే సరైన బ్రేక్ ఫాస్ట్ చాలా అవసరం. తక్కువ చక్కెర కలిగిన జీర్ణానికి అనుకూలమైన ధాన్యాలు, పండ్లు, నట్స్ తీసుకోవడం మంచిది.



ప్రాసెస్ చేసిన ఆహారాలకు బదులుగా స్వచ్ఛమైన ఆహారాన్ని ఎంచుకోవాలి. ఇలా చేస్తే మానసిక స్పష్టత కూడా పెరుగుతుంది. ఉదయాన్నే 5 నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చుని రోజూ ఉండే ఆందోళనల నుంచి కాసేపు విరామం తీసుకోవడం అవసరం. శ్వాసపై ధ్యానం లేదా మెలోడీ సంగీతం వినడం ద్వారా మనసు ప్రశాంతంగా మారుతుంది. ఇది శరీరానికే కాదు మన ఆలోచనల తీరుకు కూడా మంచి మార్గాన్ని కలిగిస్తుంది. మీకు ఎక్కువ సమయం లేకపోయినా సరే ఉదయాన్నే కనీసం 5 నిమిషాలు స్ట్రెచింగ్ లేదా సూర్య నమస్కారాలు చేయడం శరీరానికి మంచి శక్తిని ఇస్తుంది. కండరాల ఉల్లాసం, రక్త ప్రసరణ మెరుగుపడటం, శరీరం ఫ్రెష్ గా మారడం లాంటి లాభాలు ఉంటాయి. నిద్రలేచిన వెంటనే ఆ రోజు చేయాల్సిన ముఖ్యమైన పనులను గుర్తించండి. వాటికి ప్రాధాన్యతనిచ్చి దృష్టి పెట్టండి. ఇలా చేస్తే పనులపై స్పష్టత ఏర్పడి ఇతర ఆందోళనలు దూరంగా ఉంటాయి. ఇది మీ పనిదినాన్ని విజయవంతంగా మారుస్తుంది. ఈ అలవాట్లను ప్రతి ఉదయం పాటిస్తే శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు.. మానసిక ప్రశాంతత కూడా మీకు దక్కుతుంది. చిన్న చిన్న మార్పులతో పెద్ద మార్పులను సాధించవచ్చు.



## దానిమ్మ ఆకులతో

# ఆరోగ్య ప్రయోజనాలు

అవును ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు అభిప్రాయం ప్రకారం..దానిమ్మ ఆకులు ఎంతో పోషకమైనవిగా చెబుతున్నారు. దానిమ్మ ఆకుల వల్ల జీర్ణ సమస్యల నుండి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు ఇది అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు దివ్యౌషధంగా పనిచేస్తుందని చెబుతున్నారు. ఇది నిద్ర సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. దానిమ్మ ఆకులను ఆహారంలో భాగంగా తీసుకోవటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దానిమ్మ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివని అందరికీ తెలుసు. కానీ, దానిమ్మ ఆకులు కూడా అంతే ఆరోగ్యవంతమైన ప్రయోజనాలను కలిగి ఉన్నాయని మీకు తెలుసా..? అవును ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు అభిప్రాయం ప్రకారం..దానిమ్మ ఆకులు ఎంతో పోషకమైనవిగా చెబుతున్నారు. దానిమ్మ ఆకుల వల్ల జీర్ణ సమస్యల నుండి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు ఇది అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు దివ్యౌషధంగా పనిచేస్తుందని చెబుతున్నారు. దానిమ్మ ఆకులు మంచి ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. ఈ ఆకులను ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. కామోద్దీపన వ్యాధులు, విరేచనాలు, మలబద్ధకం వంటి వ్యాధులతో బాధపడేవారు దీని రసం తాగడం ద్వారా త్వరగా ఉపశమనం పొందుతారని చెబుతారు. ఇది జీర్ణక్రియను సజావుగా చేయడంలో సహాయపడుతుంది. ఈ ఆకులు కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు వంటి వివిధ ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి. ఈ దానిమ్మ ఆకుల కషాయాన్ని ప్రతి ఉదయం మీరు నిద్రలేచిన వెంటనే లేదా రాత్రి పడుకునే ముందు తాగితే మంచిది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, దానిమ్మ ఆకును తినడం వల్ల శరీరానికి మంచి పోషకాలు లభిస్తాయని చెబుతారు. ఇది నిద్ర సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. దానిమ్మ ఆకులను ఆహారంలో భాగంగా తీసుకోవటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

# ఫ్యాటీ లివర్‌ను తగ్గించే జ్యూస్..!

మన శరీరంలో కాలేయం చాలా ముఖ్యమైన అవయవం. ఇది సరిగా పనిచేయాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం. ఈ మధ్య నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ అనే సమస్య చాలా మందిలో కనిపిస్తోంది. దీన్ని నివారించడంలో బీట్ రూట్ జ్యూస్ చాలా సహాయపడుతుంది. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పోషకాలతో నిండి ఉంటుంది. బీట్ రూట్ లో పొటాషియం, సోడియం, ఫాస్ఫరస్, కాల్షియం, మాగ్నీషియం, ఐరన్, జింక్ లాంటి ఎన్నో ఖనిజాలు ఉంటాయి. ఇందులో శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఫైబర్, చక్కెర, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. బీట్‌రూట్ జ్యూస్ తాగితే శక్తి పెరుగుతుంది. కాలేయాన్ని శుభ్రపరచడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. బీట్ రూట్ లో ఉండే బీటైన్ అనే పదార్థం కాలేయానికి చాలా అవసరం. ఇది శరీరంలో కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. దీని వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా కాపాడుతుంది. ఇది డిటాక్స్ ప్రక్రియను వేగవంతం చేస్తూ శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపుతుంది. శరీరంలో అలసట లేకుండా శక్తివంతంగా ఉండటానికి బీట్ రూట్ జ్యూస్ సహాయపడుతుంది. రోజూ కొంత బీట్ రూట్ జ్యూస్ తాగితే శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఎందుకంటే ఇందులో ఉండే నైట్రేట్ పదార్థం నైట్రిక్ ఆక్సైడ్ గా మారి రక్తనాళాలను విస్తరిస్తుంది. దీని వల్ల రక్త ప్రవాహం బాగా జరుగుతుంది. ఇది శరీరానికి తక్కువ ఒత్తిడితో రక్తాన్ని అందించేందుకు సహాయపడుతుంది. బీట్ రూట్ లో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలో కణాల దెబ్బతినటాన్ని అరికట్టవచ్చు.



దీని వల్ల కాలేయ కణాలు ఆరోగ్యంగా ఉండే అవకాశం పెరుగుతుంది. బీట్ రూట్ జ్యూస్ రోజూ తాగడం వల్ల కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. కొంతమంది బీట్ రూట్ ను ఉడకబెట్టి తింటారు. మరికొందరు జ్యూస్ రూపంలో తీసుకుంటారు. జ్యూస్ రూపంలో తీసుకుంటే శక్తి త్వరగా శరీరానికి అందుతుంది. ఇది జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. దీని వల్ల శరీరంలో అవసరం లేని పదార్థాలు త్వరగా బయటకు వెళ్తాయి.ప్రతిరోజూ 100 మిల్లీలీటర్ల బీట్ రూట్ జ్యూస్ తాగితే దాదాపు 95 కిలో కేలరీల శక్తి, 22.6 గ్రాముల కార్బోహైడ్రేట్లు, కొంత ప్రొటీన్, కొవ్వు పదార్థాలు, ఫైబర్, సహజ చక్కెరలు లభిస్తాయి. ఇవన్నీ కలిసి శరీరానికి అవసరమైన అన్ని మినరల్స్ ను అందిస్తాయి. పరిశోధనల ప్రకారం బీట్ రూట్ జ్యూస్ తాగడం వల్ల లివర్ ఎంజైమ్స్ చురుకుగా పనిచేస్తాయని కాలేయానికి మేలు జరుగుతుందని తేలింది. కాలేయం సహజంగా చేసే డిటాక్స్ ప్రక్రియ వేగవంతం అవుతుంది. ఇది దీర్ఘకాలంలో కాలేయం ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడుతుంది. బీట్ రూట్ జ్యూస్ కొవ్వు కాలేయ సమస్యను నివారించడమే కాక శరీరానికి శక్తిని అందించి కాలేయాన్ని చురుకుగా పనిచేసేలా చేస్తుంది. రోజూ పరిమిత మోతాదులో తీసుకుంటే.. దీర్ఘకాల కాలేయ ఆరోగ్యానికి ఇది ఒక అద్భుత సహాయకారిగా నిలుస్తుంది.



# డయాబెటిస్ వల్ల

## జ్ఞాపకశక్తి దెబ్బతింటుందా..?

ఈ రోజుల్లో డయాబెటిస్ వల్ల జ్ఞాపకశక్తి తగ్గే ప్రమాదం ఎక్కువగా కనిపిస్తోంది. మెదడుకు శక్తిని అందించే గ్లూకోజ్ సరఫరా లేకపోవడం, ఇన్సులిన్ ప్రభావం వల్ల మెదడు పనితీరు ప్రభావితమవుతుంది. సరైన ఆహారం, వ్యాయామం, నిద్ర, మానసిక విశ్రాంతి తో జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. ప్రస్తుత రోజుల్లో డయాబెటిస్ సమస్య సాధారణ జీవనశైలి వ్యాధిగా మారిపోయింది. ఈ వ్యాధి రక్తంలో చక్కెర స్థాయిని పెంచడమే కాదు.. శరీరంలోని చాలా భాగాలపై చెడు ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా మెదడు పనితీరు, జ్ఞాపకశక్తిపై దీని ప్రభావం ఎక్కువగా కనిపించవచ్చు. జ్ఞాపకశక్తి తగ్గడానికి కారణాలు ఏంటి..? విజ్ఞానపరంగా అమ్నీషియా అని పిలిచే జ్ఞాపక లోపం చాలా కారణాల వల్ల రావచ్చు. మెదడుకు రక్త ప్రసరణ సరిగా జరగకపోవడం మెదడులో గాయాలు, దెబ్బలు ఎక్కువ కాలం మద్యం తాగడం మెదడును ప్రభావితం చేసే వైరల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు కొంత మందికి షుగర్, థైరాయిడ్, మెటబాలిజం సంబంధించిన వ్యాధులు మానసిక ఒత్తిడి, నిద్రలేమి డయాబెటిస్ జ్ఞాపకశక్తి మధ్య సంబంధం రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు.. మెదడుకు కావాల్సిన గ్లూకోజ్ సరఫరాకు ఇబ్బంది కలుగుతుంది. దీనివల్ల మెదడు శక్తిని కోల్పోయి తాత్కాలిక జ్ఞాపక లోపానికి దారితీస్తుంది. ఇది రోజురోజుకూ పెరుగుతూ ఎక్కువ కాలం ఉండే మెంటల్ డిక్లైన్ (జ్ఞాపకశక్తి కోల్పోవడం)గా మారే ప్రమాదం ఉంది. ఇన్సులిన్ సరిగా విడుదల కాకపోవడం వల్ల మెదడులోని నరాల్లో సంకేతాలు పంపడం మారిపోతుంది. శరీరంలోని కొన్ని భాగాలు మెదడుకు అవసరమైన శక్తిని ఇవ్వకపోవడం వల్ల జ్ఞాపకశక్తి తగ్గుతుంది. డయాబెటిస్ ఉన్నవారు కొన్ని పద్ధతులు పాటిస్తే జ్ఞాపకశక్తి సమస్యలకు దూరంగా ఉండవచ్చు. అధిక కార్బోహైడ్రేట్లు, తీపి పదార్థాలను తగ్గించండి. ఫైబర్, ప్రోటీన్, మంచి కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకోండి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక, యోగా లేదా ప్రాణాయామం లాంటి గుండెకు మంచి చేసే వ్యాయామాలు చేయండి. ఇవి మెదడుకు రక్త ప్రసరణ మెరుగుపరచడంలో సహాయపడతాయి.

మద్యం, ధూమపానం మానేయాలి.. ఇవి మెదడు పనితీరును తగ్గించడమే కాకుండా.. జ్ఞాపకశక్తిని బలహీనంగా చేస్తాయి. రోజూ కనీసం 7 నుండి 8 గంటలు నిద్రపోవడం మెదడు విశ్రాంతికి జ్ఞాపకశక్తి మెరుగుదలకీ చాలా ముఖ్యం. చదవడం, క్రాస్ వర్డ్స్, పజిల్స్, శ్రద్ధగా వినడం లాంటివి మెదడును చురుకుగా ఉంచుతాయి. ధ్యానం కూడా మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. జ్ఞాపక లోపం ఎక్కువగా ఉంటే న్యూరాలజిస్ట్ లేదా ఎండోక్రైనాలజిస్ట్ ను సంప్రదించడం మంచిది. అవసరమైతే మెమరీ ఎన్ హాన్సింగ్ మందులపై సలహా తీసుకోవచ్చు. డయాబెటిస్ వల్ల మెదడు పని తీరు తగ్గే అవకాశం ఉన్నా.. సరైన జీవనశైలి, ఆహార నియమాలు, మానసిక ప్రశాంతతతో ఉన్నప్పుడు మనం జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. ముందు జాగ్రత్తలు తీసుకోవడమే మానసిక ఆరోగ్యానికి మంచి భవిష్యత్తును అందిస్తుంది.

## స్టార్ ఫ్రూట్

# ఉంటే చాలు..

### – అనారోగ్య సమస్యలకు చెక్..

పండ్లలో స్టార్ ఫ్రూట్ ఒక ప్రత్యకమైన ఆకారంను కలిగి ఉంటుంది. నక్షత్ర ఆకారంలో కనిపించే ఈ పండు జ్యూసీ జ్యూసీగా ఉండడమే కాదు బాగా పండిన పండ్లు పసుపురంగులోకి మారి తియ్యగా ఉంటాయి. పచ్చి పండ్లు పుల్లగా ఉంటాయి. ఈ స్టార్ ఫ్రూట్ లో విటమిన్ ఎ, బి , సి పుష్కలంగా ఉంటాయి. అధికంగా ఫైబర్: ఈ పండులో ఎక్కువ శాతం ఫైబర్, తక్కువ కేలరీలు నిండి ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థకు మంచిది. అంతేకాదు ఈ పండు ప్రేగు శుభ్రపరుస్తుంది. దీని తరచు తింటే అనారోగ్యం దరి చేరదు. కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతుంది:



స్టార్ ఫ్రూట్స్ మీ కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. అంతేకాదు రక్తంలోని పేరుకున్న కొవ్వును కూడా తొలగిస్తుంది. మీకు కొలెస్ట్రాల్ సమస్య ఉంటె ఈ పండును కచ్చితంగా తినండి. బరువు తగ్గడానికి మంచి సహాయకారి: పోషకాలతో నిండి. తక్కువ కేలరీలు కలిగిన ఈ స్టార్ ఫ్రూట్ బరువు తగ్గడానికి అనువైన పండు. జీవక్రియను పెంచుతుంది. శరీరంలోని ఎక్కువ కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. గుండెకు మంచిది: గుండె సమస్యతో బాధపడుతున్నవారికి కూడా ఈ పండు ఎంతగానో సహాయపడుతుంది. సోడియం, పొటాషియం, ఇతర ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న స్టార్‌ఫ్రూట్స్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తినిచ్చే మంచి బూస్టర్: స్టార్‌ఫ్రూట్‌లో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. స్టార్ ఫ్రూట్‌లో మెగ్నీషియం, ఐరన్, జింక్, మాంగనీస్, పొటాషియం . ఫాస్పరస్ ఉన్నాయి. అందుకే వీటిని తినాలని డాక్టర్లు కూడా సూచిస్తారు.

# కలబంద జ్యూస్ తాగితే ఎన్ని లాభాలో..


జ్యూస్ తాగలేను అనుకునేవారు అందులో కాస్త నిమ్మరసం, తేనెలాంటివి కలుపుకొని తాగవచ్చు. బీపీ, షుగర్ వంటివి తగ్గడానికి అలోవెరా ఉపయోగపడుతుంది. రోజుకు రెండు స్పూన్ల కలబంద జ్యూస్ తాగాలి. స్నానానికి ముందు చర్మానికి కలబందను సబ్బు రాసుకున్నట్టుగా రాసుకోవాలి. ఆ తర్వాత స్నానం చేస్తే చర్మం క్లీన్ అయిపోతుంది. గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా రక్షణ కల్పిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతలో కలబంద దోహదం చేస్తుంది. కలబంద ఎన్నో సుగుణాలు ఉన్న ఔషధ మొక్క. కలబందలోని విటమిన్ దీ, జ, జు, ఫోలిక్ యాసిడ్ వంటి అనేక పోషకాలు ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో కలబంద జ్యూస్ తాగితే మెరుగైన ఫలితాలు ఉంటాయి. కలబంద రసం మీ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది బాగా పని చేస్తుంది. శరీరంపై ఏర్పడే గాయాలు మాన్పించే గుణాలు కలబందలో ఉన్నాయి. ఇది చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కలబంద గుజ్జు, కొబ్బరి నూనెను కలిపి జుట్టుకు పట్టిస్తే ఎంతో మృధువుగా తయారవుతుంది. తలలో చుండ్రు వదిలిపోతుంది. కలబందలోని పోషకాలు, ఎంజైములు, అమైనో యాసిడ్స్, ఖనిజాలు అధిక బరువును తగ్గిస్తాయి. ప్రతిరోజూ గ్లాస్ నీటిలో 20 శాతం అలోవెరా గుజ్జును కలిపి తాగాలి. ఇది ఎంతో మేలు చేస్తుంది. కడుపులోని కొవ్వు, చెడుపదర్థాలు, పేగులకు అంటుకుపోయే ఆయిల్ వంటివన్నీ క్లీన్ అయిపోతాయి. శరీరంలోని టాక్సిన్స్‌ను బయటికి పంపించడంలో అలోవెరా జ్యూస్ సాయం చేస్తుంది. జ్యూస్ తాగలేను అనుకునేవారు అందులో కాస్త నిమ్మరసం, తేనెలాంటివి కలుపుకొని తాగవచ్చు. బీపీ, షుగర్ వంటివి తగ్గడానికి అలోవెరా ఉపయోగపడుతుంది. రోజుకు రెండు స్పూన్ల కలబంద జ్యూస్ తాగాలి. స్నానానికి ముందు చర్మానికి కలబందను సబ్బు రాసుకున్నట్టుగా రాసుకోవాలి. ఆ తర్వాత స్నానం చేస్తే చర్మం క్లీన్ అయిపోతుంది. గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా రక్షణ కల్పిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతలో కలబంద దోహదం చేస్తుంది.



# చంద్రగ్రహణ కాలంలోనూ మూతపడని శ్రీకాళహస్తి ఆలయం భక్తులకు దర్శనాలు








**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** దక్షిణకాశీగా రాహుకేతు క్షేత్రంగా ఉన్న శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయం గ్రహణ సమయంలో తెరిచే ఉంటుంది. గ్రహణ సమయంలో అన్ని హిందూ ఆలయాలు మూసివేస్తే శ్రీకాళహస్తిలో క్షేత్రంలో గ్రహణ సమయం లో ముక్కంటి దర్శనం భక్తులకు గ్రహణ సమయంలో గ్రహణ కాలాభిషేకాలు నిర్వహిస్తారు. అంతేకాదు భక్తులు కూడా స్వామివారిని దర్శించుకుంటారు. గ్రహణాల సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది అందుకే ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తారు.నేడు చంద్రగ్రహణం ఉన్న సంగతి తెలిసిందే. అయితే చంద్రగ్రహణం రోజు మూతపడని ఆలయం.దక్షిణ కైలాసంగా శ్రీకాళహస్తీశ్వరాలయం. సూర్య, చంద్రగ్రహణాల సమయంలో కూడా శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయం మూతపడక పోవడం ఇక్కడ ప్రత్యేకం. అంతేకాకుండా గ్రహణ పట్టువిడుపు సమయాలలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక గ్రహణ కాలాభిషేకాలు నిర్వహించడం ఇక్కడ ఆచారం.గ్రహణ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో శ్రీకాళహస్తిలో స్వామి అమ్మవార్లను దర్శించుకుంటూ ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.ఆదివారం గ్రహణం ఉంటుంది. రాత్రి 9 గంటలకు ఆలయాన్ని మూసివేయనున్నారు. తిరిగి గ్రహణ సమయంలో ఆలయాన్ని తెరిచి స్వామి, అమ్మవార్లకు గ్రహణ కాల అభిషేకాలు నిర్వహించి భక్తులను దర్శనానికి శ్రీకాళహస్తీశ్వరాలయంలో చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక పూజలతో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం రాత్రి 9 గంటల 50 నిమిషాలకు ప్రారంభమై రాత్రి ఒంటిగంట 20 నిమిషాల వరకు ఉంటుందని అర్ధగిరి స్వామి తెలిపారు.ఈ గ్రహణ కాల సమయంలో భారతదేశంలోని అన్ని దేవాలయాలు మూసివేస్తారని ఆయన తెలిపారు. ఒక్క శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాత్రం ఆ సమయంలో తెరిచి ఉంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు విశేష అలంకరణ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని మూగజీవాలైనటువంటి శ్రీ అంటే సాలిపురుగు,కాలా అంటే నాగుపాము,హస్తి అనగా ఏనుగు ఈమూడు అత్యంత భక్తిపార్వస్యంతో పూజ చేసి శివునిలో ఐక్యమయ్యాయి అన్నారు.ఈ కాళహస్తీశ్వర క్షేత్రంలో స్వామివారికి తలం మీద ఐదు తలల సర్పము ఉంటుంది. జ్ఞానాన్ని ప్రసాదించే తల్లి జ్ఞాన ప్రసూనాంబికా దేవి అమ్మవారికి నడుము వద్ద ఒక సర్పం ఉంటుంది. కావున ఈ గ్రహణకాల సమయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. ఈ క్షేత్రం రాహుకేతు క్షేత్రంగా విరాజిల్లుతుంది. ఆ సమయంలో స్వామి అమ్మవాలను దర్శించుకుంటే స్వామి అమ్మవార్లు కృపకు పాత్రులు అవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపిక

బెల్లంపల్లి,: జన్నారం మండలంలోని పోనకల్ గ్రామానికి చెందిన కస్తూరి శ్రీకాంత్, దండేపల్లి పాఠశాలకు చెందిన బుర్ర గిరిధర్, తాళ్లపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఈ రామరాజు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు ప్రస్తుతం పాత పానకల్ ఎంపీపీఎస్ పాఠశాల, దండేపల్లి పాఠశాల, తాళ్లపేట ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. మంచిర్యాల జిల్లా నుండి ముగ్గురు ఉపాధ్యాయులు ఈ గౌరవాన్ని అందుకున్నారు. సెప్టెంబర్ 9న వీరికి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

## కలమడుగు తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన మేనేజర్ శిరీష బాధ్యతలు స్వీకరణ



మంచిర్యాల,: జన్నారం మండలంలోని కలమడుగు తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన మేనేజర్ గా శిరీష శనివారం బాధ్యతలు స్వీకరించారు. బ్యాంకు ఖాతాదారులకు, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తానని, రైతులకు, ప్రజలకు సకాలంలో రుణాలు అందేలా చూస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను స్థానిక జడ్పీ పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి, గ్రామ ప్రముఖులు సన్మానించారు. అందరూ సహకరించాలని ఆమె కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా గిరిధర్ ఎంపిక

చెన్నూరు, : మంచిర్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గిరిధర్ ను లక్షెట్టిపేట మండలంలోని దౌడేపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు శనివారం సన్మానించారు. నూతన విద్యా పద్ధతులను పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించినందుకు ఆయనను జిల్లా అధికారులు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, గ్రామస్తులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం

సిర్పూర్, : వాంకిడి ఎస్సై మహేందర్ ప్రజలను సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేస్తే ఫోన్ లోని వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే 100కు కాల్ చేయాలని సూచించారు.

## ఎమ్మెల్సీని కలిసిన నూతన డీఎస్పీ వాహిఉద్దీన్

ఆసిఫాబాద్, : కాగజ్ నగర్ నూతన డీఎస్పీ వాహిఉద్దీన్, శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ను కాగజ్‌నగర్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ప్రజలతో మమేకమై శాంతి భద్రతలను కాపాడాలని డీఎస్పీ వాహిఉద్దీన్ కి సూచించారు. ఈ భేటీలో శాంతిభద్రతల పరిరక్షణపై చర్చ జరిగింది.

## సకాలంలో స్పందించి కాపాడిన రిజర్వ్ ఇన్స్పెక్టర్ రమేష్

మానకొండూరు, : రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజకవర్గంలో శనివారం జరిగిన సంఘటనలో, ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన తల్లికొడుకులు ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్తుండగా వెంకట్రావుపల్లి గ్రామ శివారులో అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో వారి తలకు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న రిజర్వ్ ఇన్స్పెక్టర్ రమేష్ వారిని గమనించి, వెంటనే తన వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మార్గమధ్యంలో అంబులెన్స్ రావడంతో, వారిని అందులో ఎక్కించి ఆసుపత్రికి తరలించేలా చూసి మానవత్వం చాటుకున్నారు.

## మనస్తాపంతో 15 ఏళ్ల బాలుడు ఆత్మహత్య

జగిత్యాల,: జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో వినాయక మండపం వద్ద జరిగిన చిన్న గొడవలో మనస్తాపానికి గురైన 10వ తరగతి విద్యార్థి కైరకొండ మనోజ్ (15) రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం జరగాల్సిన నిమజ్జన ఉత్సవానికి సంబంధించిన డబ్బుల విషయంలో తలెత్తిన మనస్పర్థల కారణంగా, నింద భరించలేక బాలుడు ఇంట్లో ఉరేసుకున్నట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ ఘటనతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.


## అయిలాపూర్ లో స్నేహ బంధానికి గాజుల సందడి

కోరుట్ల, : కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో స్నేహ బంధానికి గుర్తుగా అందరూ కలిసి గాజులు మార్చుకొని, పసుపు కుంకుమలతో సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించుకున్నారు. పచ్చని చెట్ల కింద రుచికరమైన వంటలు చేసుకొని వనభోజనాలు చేశారు. పెద్దలు, పిల్లలు అందరూ కలిసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో గ్రామం పండుగ శోభను సంతరించుకుంది.

## మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటిపై బంధువుల దాడి, ఆందోళన

ఇల్లందు, : ఇల్లెందు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఇంటిపై రాత్రి బంధువులు దాడి చేశారు. మోట్లగూడెంకు చెందిన బావమరిది గడిపర్తి శ్రీనివాస్, ఆర్థిక లావాదేవీల విషయంలో విభేదాల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆగ్రహంతో బంధువులు మృతదేహాన్ని వెంకటేశ్వరరావు ఇంటి వద్దకు తెచ్చి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఇంట్లోని కారు, అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

## ఆనంద్ గౌడ్‌కు మదర్ తెరిసా రాష్ట్ర అవార్డు అందజేత




కొత్తగూడెం,: కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన ఆనంద్ గౌడ్ కు శనివారం మానవతావాది, నోబుల్ శాంతి పురస్కార గ్రహీత మదర్ తెరిసా వర్ధంతి సందర్భంగా అనాథ వృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు, బెతెస్త ఫౌండేషన్ అధినేత డా. దుర్గం ప్రభాకర్ చేతుల మీదుగా రాష్ట్ర మదర్ తెరిసా అవార్డు అందజేయబడింది. ఈ అవార్డు తనకు రావడం ఎంతో ఆనందంగా ఉందని ఆనంద్ గౌడ్ తెలిపారు.

# శంషాబాద్ కెపి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ కృష్ణ ప్రదీప్





**రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్ )**పురపాలక పరిధి రాళ్లగూడలోని కెపి కళాశాల డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేపీ 21 సెంచరీ కళాశాల చైర్మన్ కృష్ణ ప్రదీప్, భవాని శంకర్, వరుణ్, వేణు తదితరులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధి రాల్లగూడలో గల కెపి21 సెంచరీ డిగ్రీ విద్యార్థులు ఎం ఎం ఆర్ గార్డెన్ లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ కృష్ణ ప్రదీప్ ను ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. తదనంతరం కృష్ణ ప్రదీప్ మాట్లాడుతూ మానవతా విలువల పట్ల సాంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తును ఆశించాలని తెలిపారు. ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతో సంతోషాన్ని కలిగించాయని, విద్యార్థుల ప్రతిభా సంపత్తి కొనియాడదగినదని అన్నారు. భవాని శంకర్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ వేడుకలతో పాటు, ప్రతిభతో కూడిన అంశాలు అభినందనీయమన్నారు. వరుణ్ మాట్లాడుతూ చదువుతోపాటు సాంస్కృతి సాంప్రదాయాలు, ఆచార్య వ్యవహారాలు సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి

అశ్వారావుపేట, : ఖమ్మం నగరంలోని ధంసలాపురం వద్ద జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్–ఎంట్రీ పనులు, ఆర్ఓబీ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. హైవే పనులు పూర్తయ్యేలోపు ధంసలాపురం బ్రిడ్జి ఎంట్రీ, ఎగ్జిట్ పనులు పూర్తి చేయాలని ఎన్ హెచ్ఏఐ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సాగర్ కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. వ్యక్తి మృతి

పినపాక, : ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లగూడెం వద్ద రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వరంగల్ మార్గం నుంచి ఖమ్మం వైపు వస్తున్న కారు అతివేగంతో అదుపుతప్పి సాగర్ కాల్వలోకి దూసుకెళ్లింది. కారు డోర్లు లాక్ అవ్వడంతో లోపలి వ్యక్తి బయటకు రాలేకపోయాడు. కారును బయటకు తీసి అద్దాలు పగులగొట్టే లోపే డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి మృతి చెందాడు.

## భక్తుని ప్రాణాలు కాపాడిన మిల్స్ కాలనీ పోలీసులు

వరంగల్ ఈస్ట్, : వరంగల్ ఉర్సు గుట్ట వద్ద గణేశ్ నిమజ్జనం సందర్భంగా, విధి నిర్వహణలో ఉన్న పోలీసులు ఒక భక్తుడి ప్రాణాలను కాపాడారు. నిమజ్జనం వీక్షిస్తున్న భక్తునికి ఫిట్స్ రావడంతో, మిల్స్ కాలనీ ఎస్సై శ్రవణ్, కానిస్టేబుల్ చందు వెంటనే స్పందించి అత్యవసర చికిత్స అందించారు. ట్రాక్టర్ లో కూర్చున్న భక్తుడు కాళ్లు చేతులు ఆడిస్తూ నురగ కక్కుతుండటాన్ని గమనించి, వారు వెంటనే మర్దన చేసి, ప్రాణాపాయం నుంచి తప్పించారు. ఈ సంఘటన శనివారం జరిగింది.

## అదుపు తప్పి బోల్తా పడిన లారీ

నర్సంపేట: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని అప్పలరావుపేట రోడ్డులో శనివారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీ వేగంగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మూల మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

## నిమజ్జనంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త డాన్స్

పాలకుర్తి, : హైదరాబాద్ నగరం సహా రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. పలు చోట్ల నిమజ్జనాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేస్తున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో జరిగిన వినాయకుడి నిమజ్జనంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీ రెడ్డి డాన్స్ చేస్తూ ఉత్సాహం నింపారు. సినిమా పాటలకు అదిరిపోయే స్టెప్పులు వేస్తూ.. కార్యకర్తల్లో అభిమానులను అలరించారు. ఈ విడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## యువకుడు దారుణ హత్య

భూపాలపల్లి, : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బాసిత్ (21) అనే యువకుడిని కిడ్నాప్ చేసి, కాళ్లు చేతులు కట్టేసి, పెట్రోల్ పోసి దారుణంగా హత్య చేశారు. మూడు రోజుల క్రితం కిడ్నాప్ అయినట్లు తల్లి సబియా ఫిర్యాదు చేయగా, మేడారం సమీప అడవుల్లో మృతదేహం లభించింది. కుషాల్, బబ్లూ, ప్రశాంత్ అనే వ్యక్తులు కారులో కిడ్నాప్ చేసి తీసుకుపోయారని అతని తల్లి సబిహ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆర్థిక లావాదేవీల వివాదాల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 24 గంటలు వైద్య సేవలు అందించాలని నిరసన

డోర్నకల్, : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తన తల్లి మృతి చెందిందని ఆరోపిస్తూ సతీష్ అనే యువకుడు శనివారం ఆసుపత్రి వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. తనలాంటి పరిస్థితి మరెవరికీ రాకుండా కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలూ సేవలు అందించాలని అతను డిమాండ్ చేశాడు. గతంలో తన తల్లి ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వస్తే సరైన వైద్యం అందక, మహబూబాబాద్‌కు తరలించినా ఫలితం లేక చనిపోయిందని తెలిపాడు.

## రైతు వారోత్సవాలు ప్రారంభం

సంగారెడ్డి, : బలరామ జయంతిని పురస్కరించుకుని, సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డి పేట, బస్వాపూర్ గ్రామాలలో భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా ఉపాధ్యక్షులు వై. యాదగిరి రెడ్డి జండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జిల్ల మహేష్ బాబు ముదిరాజ్, గ్రామ అధ్యక్షులు శేఖర్, సభ్యులు లక్ష్మయ్య, గంగారాం గౌడ్, విష్ణయ్య, ఎర్ర గొల్ల రాములు, శ్రీశైలం, సుభాష్ గౌడ్, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ ఆలయానికి భజన మండలి ప్రయాణం

నారాయణఖేడ్, : సేవాలాల్ మహారాజ్ఆదేశాల మేరకు చున్నం బట్టి తండా భజన మండలి పోరదేవి మరియు సేవాలాల్ మహారాజ్ ఆలయానికి వెళుతున్నారు. మొగుడంపల్లి మండలం నుంచి సేవాలాల్ మహారాజ్ పోరఘడ్ కి ప్రయాణ యాత్రలో బీ లచ్చిరామ్, కాంగ్రెస్ సీనియర్ లీడర్, డైరెక్టర్, చున్నం భట్టి తండా, జహీరాబాద్ నియోజకవర్గ నాయకుడు కూడా ఉన్నారు. ఈ ప్రయాణంలో రాము రాథోడ్, రాజు రాథోడ్, భీమ్ సింగ్ చవాన్, తుకారం రాథోడ్, రూప్ సింగ్ రాథోడ్, లింబాజీ, సుభాష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక పెళ్లి మండపం వద్ద వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. భారతదేశం పై అమెరికా విధిస్తున్న సుంకాలను వ్యతిరేకించండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వామ పక్ష పార్టీ నాయకులు గంధం మని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వామపక్షాల పార్టీల పిలుపు మేరకు అమెరికా భారతదేశంపై విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా శ్రీకాళహస్తిలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టామన్నారు. అమెరికా అధ్యక్షుడు భారతదేశంపై 50% సుంకాల విధించడం ద్వారా జౌలి, ఆక్వా, గార్మెంట్స్ రైతులు, వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ఆదానీని రక్షించుకోవడానికి భారతదేశాన్ని అమెరికాకు తాకట్టు పెడుతుందని వారు ఆరోపించారు. అమెరికా పట్ల మెతక వైఖరిని వీడనాడాలని వారు డిమాండ్ చేశారు. అమెరికా నుండి పత్తిని దిగుమతి చేసుకోవడంలో 10 శాతం సుంకం విధించడం ద్వారా భారతదేశంలో పత్తి రైతులు నష్టపోతున్నారని వారు తెలిపారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం అమెరికాపై గట్టి సమాధానం చెప్పాలని, వారి దిగుమతివస్తులపై సుంకం విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు కుమార్, గురునాధం, వెలివేంద్రం, కత్తి రవి, మల్లికార్జున్,రాజా, చిట్టిబాబు, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియా వాడకంతో రైతులకు ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ ఏడిఏ రమేష్ రెడ్డి




**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** నానో యూరియా వాడకంతో రైతులకు ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ ఏడిఏ రమేష్ రెడ్డి అన్నారు.మండలంలోని తొండమనాడు రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ నీటిలో కలిపి పిచికారీ చేసే 19:19:19, 20: 20 :20 బీ కాంప్లెక్స్ ఎరువులు ,అధిక సాంద్రత కలిగిన 13-0-45 ద్రవరూప నత్రజని ఎరువు వంటివి అందుబాటులో వున్నాయి దుక్కిలో సిఫారసుల మేరకు కాంప్లెక్స్ ఎరువులను వేసుకొని, పైరుపై పిచికారీ చేసే ఎరువులను స్ప్రే చేసుకుంటే తక్కు ఖర్చు, తక్కువ ఎరువుల నష్టంతో మంచి ఫలితాలను పొందవచ్చు. ఉదాహరణకు వరిలో పిలకలు పెట్టే దశలో నానో యూరియా, నానో డీఏపీ, ఫార్ములా-4 కలిపి స్ప్రే చేసుకోవచ్చు. చిరుపొట్ట దశలో నానో యూరియా, 13-0-45 కలిపి స్ప్రే చేసుకుంటే తక్కువ ఖర్చులో మంచి ఫలితాలు వస్తాయి.పైరుపై స్ప్రే చేసే ఎరువుల వాడకం వలన చీడల సమస్య తగ్గుతుంది.రైతులకు శ్రమ, ఖర్చు తగ్గుతుంది. పంటలకు వివిధ దశలలో అవసరమైన పోషకాలు నేరుగా ఆకులకు అందించి అధిక దిగుబడులను పొందవచ్చు. పంటపై పిచికారీ చేసే ఎరువుల వినియోగానికై స్థానిక అధికారులతో చర్చించి. మార్కెట్‌లో యూరియా విషయంలో ఎదుర్కొంటున్న సమస్యల ను రైతులు తగ్గించుకోవచ్చును.ఈ కార్యక్రమంలో ఏడిఏ(టిఏ) సూర్య ప్రకాష్ రెడ్డి,ఇఫ్కో సేల్స్ మేనేజర్ మణి చంద్ర, రైతు సేవ కేంద్రం సిబ్బంది కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

# మానవసేవే మాధవ

**- వరద బాధితులకు సహాయం అందించిన సత్య సాయి సేవ సమితి**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారి శత జయంతి ఉత్సవాలలో భాగంగా స్వామివారి దివ్య అనుగ్రహంతో శనివారం ధర్పల్లిలో ప్రభుత్వ బస్టాండ్ ఏరియాలో ఉన్న నిరుపేద పది కుటుంబాలకు దోమ తెరలు అందించడం జరిగింది. ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు ముత్యాల కెవి వడి గ్రామాన్ని నీళ్లతో ముంచే అన్ని కోల్పోయి అనాథలు నిలబడి ఉన్నా వరద బాధితులకు 76 మందికి చీరలు అందించడం జరిగింది. పేద వృద్ధుడికి దోతులు, అంగీ బట్ట, లుంగీ, తువాలిలు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో చిలుక శంకర్, సత్యసాయి సేవా ట్రస్ట్ కన్వీనర్ మాల్గారి శ్రీనివాస్, మచ్చ బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలి : ఎమ్మెల్యే కూనంనేని

**- వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటేనే పాత్రికేయరంగంలో గుర్తింపు**

**- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఘనంగా జర్నలిస్టు డే వేడుక**

**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారదులుగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టు డేని పురస్కరించుకుని శనివారం క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసిన ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషాతో కలిసి పలువురు జర్నలిస్టులకు పాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి ఎంతో విలువలతో కూడినదని, సమసమాజ స్థాపన కోసం జర్నలిస్టులు అనునిత్యం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పరిపాలనలో లోటుపాట్లు జరిగినప్పుడు, అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడినప్పుడు, దోపిడీ పెరిగిపోయినప్పుడు జర్నలిస్టులు వాటిపై అక్షర యుద్ధం చేయాలని, వ్యవస్థను, వ్యక్తులను గాడిలో పెట్టేందుకు కృషి చేయాలన్నారు. మారుతున్న కాలనుగునంగా జర్నలిస్టు వృత్తిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, వృత్తి నియమాలను పాటిస్తూ విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. నియోజకవర్గాభివృద్ధికి జర్నలిస్టుల సూచనలు, సలహాలు కూడా అందించాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో చెప్పామని, అనునిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులు ఆరోగ్యాల పట్ల, కుటుంబాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంతో కాలంగా విలేకరులు ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించేందుకు కృషి మొదలు పెట్టామని, దీనిపై ఇప్పటికే కలెక్టర్ తో పలు దఫాలుగా చర్చించామని, ప్రభుత్వం




దృష్టికి తీసుకెళ్లి త్వరలో కార్యరూపం దాల్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకు ఇంటి జాగా వచ్చేందుకు తన వంతు ప్రయత్నం తప్పకుండా ఉంటుందని, దీనిలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు.

## శంషాబాద్ లో గణపయ్య నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

**- అందరి సహకారంతో ప్రశాంతంగా గణపయ్య నిమజ్జన ప్రక్రియ**



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్) పురపాలక పరిధిలో గణపయ్య నిమజ్జనం ఏర్పాట్లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శంషాబాద్ డిసిపి రాజేష్ ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో శనివారం కాముని చెరువులో ఘనపయ్య నిమజ్జన ఏర్పాట్లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శంషాబాద్ డిసిపి రాజేష్, ఏ సి పి లు, సి ఐ బాలరాజ్,మున్సిపాలిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి అవినాష్ మహంతి మాట్లాడుతూ ఘనపయ్య నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఇప్పటివరకు జంట నగరాలలో 65 వేల పైచిలుకు ఘనపయ్య నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుందని ఈరోజు పదివేల పైచిలుకు తో గణపయ్య నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు సమస్యలు తలెత్తలేదన్నారు. తో ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమంలో పోలీసులు మున్సిపాలిటీలు, ఫైర్, సర్వీసులు, వైద్య సేవలు అన్ని కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రేపు ఎల్లుండి కూడా కొన్నిచోట్ల గణపయ్య నిమజ్జనాలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ సుమన్ రావు, ఇతర అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరి బాలసుబ్రమణ్యం



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని తొట్టంబేడుమండలం దిగువ సాంబయ్యపాలెం ప్రభుత్వ పాఠశాల నందు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కయురి బాలసుబ్రమణ్యానికి సెప్టెంబర్ 5,నా ఉపాధ్యాయదినోత్సవం నాడు ఉత్తమఉపాధ్యాయ అవార్డు వరించింది. ఆయన 23 ఏళ్లగా విద్యారంగంలో వినూత్నరీతిలో విద్యార్థులకు పాఠాలను బోధించే విధానం ప్రత్యేకంగా ఉండడంతో టీచర్స్ డే నాడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆయన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయురీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ. సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని తనకు స్టేట్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేశారు,, 23 ఏళ్లుగా తాను చేస్తున్న సేవలను మరియు మరియు విద్యారంగంలో తాను వినూత్నంగా పాఠాలు చెప్పడం, మిమిక్రీ చేస్తూ పాఠాలు చెప్పి విద్యార్థులను ఆకర్షించడం, అనేక గేయాలు, రచనలు, రాయడం ఇలా తను చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తనకు స్టేట్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ పర్యాయం మహారాష్ట్ర ప్రభుత్వం తాను రాసిన సీతాకోకచిలుక బాల గేయాన్ని అక్కడిఅక్కడి తెలుగు పాఠశాలల్లో ఒకటవ తరగతి పాఠ్యాంశాలలో పొందుపరచడం తనకు ఈ సంవత్సరం గొప్ప అనుభూతిని ఇస్తుందని తెలియజేశారు, తనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి అనే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే సత్యం సహకారంతో సామాజిక వర్గాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు

**- ప్రతీ సామాజికవర్గం అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం కృషి**

**- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : వన్నెల రమణారెడ్డి**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామంలోని మాల సామాజిక వర్గం కులసంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, రెడ్డి సంఘం భవనం మిగులు నిర్మాణ పనుల కోసం రూ.5 లక్షలు చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం రూ.10 లక్షల విలువగల ప్రొసీడింగ్ కాపీని విడుదల చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి మాట్లాడుతూ,"రెడ్డి సంఘ భవనం మిగులు పనులు,మాల సంఘ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం ద్వారా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్ని సామాజిక వర్గాల అభివృద్ధి పట్ల ఉన్న కృతనిశ్చయాన్ని మరోసారి చాటిచెప్పారని, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు,సౌకర్యాలు అందేలా కృషి చేస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న సత్యం నాయకత్వం అభినందనీయం. ఈ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ స్పందన, సహకారం కూడా శ్లాఘనీయం. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన,అభివృద్ధి పక్షాన ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ప్రతీ సామాజిక వర్గం అభివృద్ధి చెందేలా కృషి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం" అని అన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సత్యం, జిల్లా కలెక్టర్ కు తడగొండ గ్రామ మాల, రెడ్డి సంఘం సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓటర్ల జాబితా ముసాయిదా ప్రదర్శన

**- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల 2వ సాధారణ ఎంపీటీసీ / జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌లో భాగంగా మండల పరిధిలోని 11 ఎంపీటీసీ నియోజకవర్గాల ఓటర్ల జాబితా ముసాయిదాను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి. జయశీల శనివారం మండల కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించారు.ఈ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే, సెప్టెంబర్ 8వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. అదే రోజు మండల స్థాయి అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.జిల్లా ప్రాథమిక పంచాయతీ అధికారి సెప్టెంబర్ 9న అభ్యంతరాలను పరిశీలించనున్నారు. తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 10న బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించనున్నట్లు ఎం.పి.డి.ఓ జయశీల వివరించారు.

## నేడు అగ్రహారం శ్రీ ఆంజనేయస్వామి ఆలయం మూసివేత

**- ఆలయ ఈఓ : నాగారపు శ్రీనివాస్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ అర్బన్ మండలం, అగ్రహారం శ్రీఆంజనేయస్వామి దేవాలయం నేడు (ఆదివారం) న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 12.30 గంటలకు మూసివేయబడుతుందని దేవాలయ ఈఓ నాగారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రహణ మోక్షం అనంతరం 08-09-2025 (సోమవారం) ఉదయం 5.00 గంటలకు సంప్రోక్షణ కార్యక్రమం జరిపి, అనంతరం ప్రాతఃకాల పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత భక్తులకు దర్శనం కల్పించి, నిత్య పూజలు యథావిధిగా కొనసాగుతాయని ఈఓ తెలిపారు.దీన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు తమ దర్శన, పూజ కార్యక్రమాలను అనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని ఈఓ శ్రీనివాస్ భక్తులను కోరారు.

# జర్నలిస్టుల సేవలు మరువ లేనివి..!!

**- సీనియర్ జర్నలిస్టులను సత్కరించిన ప్రెస్ క్లబ్ సభ్యులు..**

జూలూరుపాడు (ప్రశ్నన్యూస్) సెప్టెంబర్ 06: ప్రతిక్షణం సమాజ సేవలో ముందుండే జర్నలిస్టుల సేవలు మరువలేనివని జూలూరుపాడు సీనియర్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ పాత్రికేయులు చాపలమడుగు నరసింహారావు అన్నారు. శనివారం జర్నలిస్టు డే' ను పురస్కరించుకుని జూలూరుపాడు సీనియర్ జర్నలిస్టులు. పెండ్యాల విజయభాస్కర్, గుండా సత్యనారాయణ, బాపట్ల మురళి కి సీనియర్స్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతుండే వ్యక్తులు జర్నలిస్టులని, జర్నలిస్టుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చాపలమడుగు నరసింహారావు, ఉపాధ్యక్షులు తంబర్ల పుల్లారావు, కోశాధికారి షేక్ బుడెన్ పాషా, సంయుక్త కార్యదర్శి నల్లగట్ల దిలీప్ కుమార్, గౌరవాధ్యక్షులు గుండా సత్యనారాయణ, సంఘం నాగరాజు, గౌరవ సలహాదారులు పెండ్యాల విజయభాస్కర్, బండి సత్యనారాయణ, బాపట్ల మురళి, అన్నవరపు జశ్వంత్, కాశిమళ్ళ సురేష్, గోగుల వెంకటేశ్వర్లు, భూక్యా రత్న కుమార్ పాల్గొన్నారు.





# తెలుగువారిని మెప్పించలేకపోయిన 'మదరాసి'



శివకార్తికేయన్ హీరోగా రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా దర్శకుడు మురుగదాస్ తెరకెక్కించిన సినిమా 'మదరాసి'. 'అమరన్' విజయన్ తర్వాత శివకార్తికేయన్ నటించిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తన చిన్నతనంలోనే ఒక ప్రమాదంలో కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకున్న రఘు (శివ కార్తికేయన్) ఆ ఘటనతో డిల్యూషన్ సింద్రోమ్ కి గురవుతాడు. ఇలా 16 ఏళ్ళు చికిత్స తర్వాత తన జీవితంలోకి మాలతి (రుక్మిణి వసంత్) వస్తుంది. ఇంకో పక్క ఇద్దరు ఫ్రెండ్స్ చిరాగ్ (షబ్బీర్), విరాట్ (విద్యుత్ జమ్వాల్) లు మొత్తం చెన్నైని గన్స్‌తో నింపాలని పెద్ద ప్లాన్ చేస్తారు. ఇది ఎన్ఐఏ వారికి పెద్ద సవాలుగా మారుతుంది. ఎన్ఐఏ అధికారి ప్రేమ్ (బిజూ మీనన్) తన బృందంతో ఆ గన్ కల్చర్ ని ఆపాలని ప్రయత్నించే మిషన్ లోకి రఘు ఎలా ప్రవేశించాడు? తన ప్రేయసి కోసం రఘు ఏం చేశాడు? ఈ గన్ మాఫియా వెనుక ఉన్నది ఎవరు? గన్ లోడ్ బయటకి రాకుండా ఆపారా, లేదా అనేది మిగతా కథ. కథనం, విశ్లేషణ: దర్శకుడు మురుగదాస్ నుంచి చాలా కాలం తర్వాత వచ్చిన ఈ సినిమాలో కొత్తదనం కనిపించదు. ఈ మధ్య కాలంలో పలు సినిమాల్లో చూపిస్తున్న గన్ కల్చర్ కాన్సెప్ట్ కి తన స్టైల్ హీరో పాత్ర, దానికో లోపం పెట్టి అక్కడక్కడా తన పాత సినిమాల స్టైల్ లోనే కథనం నడిపించారు. సినిమాలో యాక్షన్, ఎమోషనల్ పార్ట్ కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. అలాగే సెకాండఫ్‌లో కథనం కూడా అంత ఆసక్తికరంగా సాగలేదు. ఈ సినిమాను శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ తమ నటనతో కాస్తంత నిలబెట్టే ప్రయత్నం చేశారు. ఇక సినిమా ప్రారంభం మొదలు, ముగింపు వరకూ ప్రతి సన్నివేశం కృత్రిమంగా ఉంది. కొత్తదనం ఉన్న సీన్ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. అయితే మొత్తానికి 'మదరాసి' తెలుగువారిని మెప్పించలేకపోయాడు.

# మిరాయ్ మేజిక్ జరగాల్సిందే

కొత్త శుక్రవారం వచ్చేసింది. వేర్వేరు అంచనాలు, ప్రమోషన్లతో వచ్చిన మూడు సినిమాల జాతకం తేలిపోయింది. కమర్షియల్ గా ఎవరి స్థాయి ఏంటనేది సోమవారానికి క్లారిటీ వస్తుంది కానీ హిట్టు స్టేటస్ పక్కనపెడితే వీటిలో ఏదీ ఓ ముప్పై కోట్ల షేర్ వసూలు చేయడం జరగని పనిలా కనిపిస్తోంది. సరే వీటి జాతకం ఎలా ఉన్నా సరిగ్గా వారం రోజుల తర్వాత రాబోతున్న మిరాయ్ మీద థియేటర్ వ్యవస్థ బోలెడు ఆశలు పెట్టుకుంది. తేజ సజ్జ హీరో కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ తో పాటు చిన్న పిల్లల్లో సైతం ఇది ఆసక్తి రేపుతోంది. చాలా రీజనబుల్ బిజినెస్ జరుపుకున్న మిరాయ్ హిట్టయితే బయ్యర్లకు భారీ లాభాలొస్తాయి. అదే రోజు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కిష్కిందపురి ఉంది కానీ హారర్ ఎలిమెంట్స్ వల్ల సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. సో మిరాయ్ కు అది కూడా అడ్వాంటేజ్ కానుంది. సెప్టెంబర్ 25 ఓజి వచ్చేదాకా మిరాయ్ కు పదమూడు రోజులు ఓపెన్ గ్రౌండ్ దొరుకుతుంది. హనుమాన్ స్థాయి బ్లాక్ బస్టర్ దక్కుతుందని తేజ సజ్జ బలంగా నమ్ముతున్నాడు. పైగా ఇతర భాషల్లో బడా సంస్థలు డిస్ట్రిబ్యూట్ చేస్తుండటంతో ఇండియా వైడ్ పెద్ద రిలీజ్ అందుకుంటోంది. బొమ్మ క్లిక్ అయితే మాత్రం తేజ సజ్జ రేంజ్ పెరగడంతో పాటు విలన్ గా మంచు మనోజ్ ఇతర బాషల డైరెక్టర్ల దృష్టిలో పడతాడు. టాలీవుడ్ కున్న ప్రధాన సమస్య గత రెండు మూడు నెలలుగా వారాల తరబడి హౌస్ ఫుల్స్ చేయిస్తున్న సినిమా ఒక్కటి రాలేదు. ఏదైనా సరే వీకెండ్ హడావిడికి పరిమితమై తర్వాత నెమ్మదిస్తున్నాయి. కానీ మిరాయ్ అలా కాకూడదు. సరైన మూవీ లేదనే కారణంతోనే జనాలు థియేటర్ల వైపు పెద్దగా చూడటం లేదు. ఇప్పుడొకటి వస్తోందంటే ఖచ్చితంగా జనాలు కదులుతారు. కాకపోతే ఆ స్థాయి టాక్ ని మిరాయ్ తెచ్చుకోవాలి. మహావీర్ నరసింహ తప్ప ఈ మధ్య కాలంలో పబ్లిక్ కళకళలాడుతూ థియేటర్లలో కనిపించిన దాఖలాలు లేవు. మరి మిరాయ్ కనక ఆ లోటు తీరిస్తే మంచిదే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీకి ఈ హిట్టు చాలా ముఖ్యం.

# అంతర్జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు



అర్జున్ చక్రవర్తి'ని విజువ ల్ ట్రీట్‌గా తెరకెక్కించిన కెమెరామెన్ జగదీష్ చీకటి పనితనం గురించి ప్రస్తుతం అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ చిత్రానికిగానూ ఎన్నో అంతర్జాతీయ వేడుకల్లో బెస్ట్ సినిమాటోగ్రాఫర్‌గా ఆయన అవార్డుల్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ చీకటి మీడియాతో మాట్లాడుతూ "హాలీవుడ్ స్థాయి కి ధీటుగా మనం సినిమాలు తీస్తున్నాం. మా 'అర్జున్ చక్రవర్తి' కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఆ స్థాయి లుక్ వచ్చేందుకు నేచురల్ లైటింగ్‌లోనే షూటింగ్ చేశాం. ఇక 'అర్జున్ చక్రవర్తి' షూటింగ్ కోసం మంచు కురిసే ప్రాంతం కదా అని కాశ్మీర్ కు వెళ్లాం. కానీ మేం వెళ్లినప్పుడు అక్కడ మంచు పడటం లేదు. దీంతో అక్కడే మంచు కురిసే వరకు ఎదురుచూశాం. అలా చివరకు మైనస్ 8 డిగ్రీల వరకు వెళ్లింది. దీంతో విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. క్లైమాక్స్ ఎపిసోడ్‌కి చాలా కష్టపడాల్సి వచ్చింది. 'అర్జున చక్రవర్తి'కి గానూ అంతర్జాతీయ స్థాయిలో నాకు నాలుగు అవార్డులు, కోలీవుడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, కేరవ్యాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, మోకో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ది బుద్దా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు వచ్చాయి"అని అన్నారు.

# చరిత్ర సృష్టించబోతున్నాం



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'అఖండ-2'. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సంయుక్తా మీనన్, హర్షల్ కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆది పినిశెట్టి విలన్‌గా కనిపించబోతున్నాడు. ఈ మూవీని బాలయ్య చిన్న కూతురు 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై ఎం తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను తమన్ సంగీతం అందిస్తున్నారు. అయితే ఈ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది. కానీ కొత్త రిలీజ్ డేట్‌ను మాత్రం చిత్రబృందం వెల్లడించకపోవడంతో అసలు ఈ మూవీ ఇప్పట్లో వస్తుందా? లేదా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక అఖండ-2ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, నందమూరి బాలయ్య ఓ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు వెల్లడించారు. "అఖండ-2 సినిమా డిసెంబర్‌లో విడుదల కాబోతుంది. తమన్ సంగీతంపై మరింత సమయం కావాలని అన్నాడు. అఖండ విడుదల సమయంలో సౌండ్ వూఫర్లు బద్దలయ్యాయి. కానీ అఖండ-2 డిసెంబర్‌లో దానికంటే 50 రేట్లు పెద్దగా ఉంటుంది. త్వరలో కచ్చితమైన రిలీజ్ తేదీని ప్రకటిస్తాము. అభిమానుల అంచనాలను మించి ఉంటుంది. బాక్సాఫీసులో చరిత్ర సృష్టించబోతున్నాము"అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న అభిమానులు కొందరు సంతోష పడుతుంటే.. మరికొందరు మాత్రం కాపీ చేసే సంగీతానికి ఇంకెన్ని రోజులు సమయం తీసుకుంటావని తమన్‌ను తిట్టిపోస్తున్నారు.


# యూనిక్ యాక్షన్ థ్రిల్లర్



జెడి చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని త్రిష సమర్పకురాలిగా సురక్ష్ బ్యానర్‌పై మల్కాపురం శివ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ప్రీతీ జంఘియానీ రీఎంట్రీ ఇస్తోంది. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌లో జె.డి చక్రవర్తి మాట్లాడుతూ "నిర్మాత శివకుమార్ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ని ముంబైలో ఎక్కడ రాజీపడకుండా చేస్తున్నారు. సీరత్ మంచి డాన్సర్, కొరియోగ్రాఫర్, సింగర్. ఈ సినిమాలో తన నటన అందరికీ నచ్చుతుంది. డైరెక్టర్ శ్రవణ్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు"అని అన్నారు. డైరెక్టర్ శ్రవణ్ మాట్లాడుతూ "సినిమాలో ఇన్వెస్టిగేషన్ పార్ట్ అద్భుతంగా ఉంటుంది. జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్, నిర్మాత శివకుమార్ చాలా సపోర్ట్ చేశారు"అని తెలిపారు.

నిర్మాత మల్కాపురం శివ కుమార్ మాట్లాడుతూ "కొత్త డైరెక్టర్ శ్రవణ్ చెప్పిన కాన్సెప్ట్ అద్భుతంగా అనిపించింది. జెడి చక్రవర్తి, నరేష్, శరత్ కపూర్ మా బ్యానర్‌లో వర్క్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది పాన్ ఇండియా మూవీ"అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరో నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ పాల్గొన్నారు.

# పవర్‌ఫుల్‌గా 'జిల్ జిల్..' సాంగ్



తెలుగు ప్రేక్షకులను అలరించిన 'మార్గన్' విజయం తర్వాత విజయ్ ఆంటోనీ 'భద్రకాళి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజ నేయులు జవ్వాజీ నిర్మించారు. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ తాజాగా 'జిల్ జిల్..' అంటూ సాగే సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని పవర్‌ఫుల్ సాంగ్‌గా దీన్ని కంపోజ్ చేశారు. భోలే షావలి స్వయంగా రాసి, పాడిన ఈ సాంగ్ హై ఎనర్జీతో ఆకట్టుకుంది. సాంగ్‌లోని పవర్ ప్యాక్డ్ విజువల్స్ సినిమాపై చాలా క్యూరియాసిటీ పెంచాయి. తెలుగులో 'మార్గన్' సినిమాను విజయం దిశగా నడిపించిన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను కూడా తెలుగులో రిలీజ్ చేస్తోంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఉండడంతో ప్రాజెక్ట్‌పై మంచి బజ్ ఉంది. ఈ సినిమా ఈనెల 19న రిలీజ్ కానుంది. 'భిన్న కథలతో మా కథానాయకుడు విజయ్ ఆంటోనీ ఎప్పుడూ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తున్నారు. ఆ కోవలోనే ఈ సినిమా కూడా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ తెలిపారు.

# ఇలాంటి పాత్ర చేయడానికి

## హనుమాన్‌కు సారీ చెప్పి రంగంలోకి దిగాను..



మంచు మనోజ్ ఇటీవల 'భైరవం'తో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. ప్రస్తుతం పాన్ ఇండియా మూవీ 'మిరాయ్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని కాంబోలో రాబోతున్న ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రియా శరన్, జగపతి బాబు, మంచు మనోజ్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషల్లో సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ జోరు పెంచిన మూవీ మేకర్స్ ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మంచు మనోజ్ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. "మిరాయ్‌లో రెండు గొప్ప శక్తులు తల పడితే ఏం జరుగుతుందో చూపించబోతున్నాము. ఇది ఒక మోడ్రన్ రావణుడు వెర్షన్‌లా ఉంటుంది. కానీ నేను ఆడవాళ్ల జోలికి వెళ్లకుండా నాకంటూ ఒక తత్వం ఉన్న పాత్రలో నటించాను. సీత రావణుడి జీవితంలోకి రాకముందు అతను ఎలా ఉండేవాడో, అలాంటి స్టైల్ ఈ పాత్రలో ఉంటుంది. అతనికి ఓటమి అంటే నచ్చదు. శక్తి ఉన్నవాడికే స్థానం దక్కాలి అన్నది అతని నమ్మకం. కష్టపడని వాడికి ఈ ప్రపంచంలో చోటు ఉండకూడదు అనే స్ట్రాంగ్ పాయింట్‌తో 'మిరాయ్' మీ ముందుకు వస్తుంది. అసలు నేను ఇలాంటి చెడ్డ వ్యక్త పాత్రలో నటించేందుకు ముందు దేవుడికి దండం పెట్టుకుని అలాగే హనుమంతుడికి క్షమాపణలు చెప్ప రంగంలోకి దిగాను" అని చెప్పుకొచ్చాడు.

# విమాన ప్రయాణాల వల్ల అలసట..

## వృత్తిపరంగా ఎదురవుతున్న కష్టం గురించి రష్మిక ఓపెన్ కామెంట్స్



నేషనల్ క్రష్‌గా దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న రష్మిక మందన్న, తాజాగా తన వృత్తిపరమైన జీవితంలో ఎదురవుతున్న ఓ సమస్యను అభిమానులతో పంచుకున్నారు.

తెల్లవారుజామున చేసే విమాన ప్రయాణాలు తనకు ఎంతటి కష్టం కలిగిస్తున్నాయో ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు. ఉదయం 3:50 గంటలకు విమానంలో కిటికీ ద్వారా తీసిన ఓ ఫోటోను షేర్ చేసిన రష్మిక, "ఉదయం 3:50 ఫ్లైట్లు చాలా దారుణం. ఇది రాత్రా? పగలా? అర్థం కావడం లేదు," అంటూ కామెంట్ చేశారు. అలాంటి టైమింగ్స్‌కి ప్రయాణాలు చేయడం తాను చాలా బాధగా అనుభవిస్తున్నట్లు తెలిపారు. "రెండు గంటలు నిద్రపోయి లేచి పని చేయాలా? అలా చేస్తే రోజంతా నీరసం. లేక నిద్రపోకుండా పని చేసి తర్వాత నిద్రపోవాలా? అలా చేసిన అదే పరిస్థితి. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం నిజంగా కష్టంగా మారుతోంది." అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె గమ్యం గురించి ఎలాంటి సమాచారం ఇవ్వనప్పటికీ, రష్మిక బిజీ షెడ్యూల్ వల్ల నిత్యం ఇలా ప్రయాణాలు చేయాల్సి వస్తోందని అర్థమవుతోంది. వృత్తిపరంగా రష్మిక ప్రస్తుతం బిజీగా ఉంది. బాలీవుడ్ లో ఆయుష్మాన్ ఖురానా సరసన 'థమా' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో పరేష్ రావల్, నవాజుద్దీన్ సిద్దిఖీ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వాంపైర్ల మిస్టరీతో కూడిన థ్రిల్లింగ్ కథగా ఈ చిత్రం రూపొందనుంది.

'ముంజ్యా' ఫేమ్ ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో ఈ మూవీ రూపొందుతుంది. దీపావళి 2025 కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.తెలుగులో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రంలో నటిస్తున్నారు.

ఇది రష్మికకు చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని ఆమె స్పష్టం చేశారు. %+ూ%2 పిక్చర్స్, మాస్ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గత డిసెంబర్‌లో విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. తాజాగా రష్మికకి సైమా అవార్డ్ దక్కిన విషయం తెలిసిందే. ఉత్తమ నటిగా అవార్డ్ దక్కించుకుంది.

# మంత్రి వడ్లూరి లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించిన బహుజనసేన నాయకులు

**– ఆర్గనైజేషన్ అధ్యక్షులు : జింక శ్రీధర్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల బహుజన సేన నాయకులు మంత్రి వడ్లూరి లక్ష్మణ్‌ను ఆది శ్రీనివాస్ క్యాంపు ఆఫీస్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుని చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ, మంత్రి అడ్లూరి ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ అభివృద్ధికి చేస్తున్న కృషి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి లక్కే సాగర్,నెదూరి శ్రీకాంత్, నెదూరి రాజు, అలువాల రాము, లక్కే దివాకర్, మల్లారం హరీష్, తదితర బహుజనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా గణపతి నిమజ్జనవేడుకలు





**మేడ్చల్(ప్రశ్న న్యూస్)** మేడ్చల్ పట్టణ పరిధిలోని శాంతినగర్ లో ప్రతిష్ఠించిన మహా గణనాథుని నిమజ్జన ఉత్సవలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డు వేలం పాట లో లక్షా 35 వేల రూపాయలకు బొల్లిపల్లి సాయి తేజ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ సందర్భంగా వారికి బహుమతులు అందజేయడం జరిగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కాలనీవాసులు అందరూ పాల్గొన్నారు. వచ్చే సంవత్సరం మళ్లీ రావాలి" అనే కోరికలతో గణపతిని జలకన్యలో నిమజ్జనం చేస్తూ చిన్నారులు, మహిళలు, పెద్దలు అందరూ ఒక్కటై ఉత్సాహంగా పాల్గొని పండుగను మరింత ప్రత్యేకంగా మార్చారు. గణపతి నిమజ్జనం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు, ఏకత, భక్తి, ఆనందం కలిసిన ఆధ్యాత్మిక వేడుకగా ప్రజలు భావిస్తు ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులన నాయిని శ్రీనివాస్, విజయకుమార్ వ్యాస్, సంజీవరావు, విష్ణువర్ధన్ రెడ్డి, నితిన్, అశోక్ కుమార్, టి శ్రీనివాస్ గుప్తా, సురేందర్ గౌడ్, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన ఈఓ రమాదేవి కి సన్మానం - శుభాకాంక్షలు

**– ఆలయాభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తాం**

**– రాజన్నాలయ ఉద్యోగుల సంఘం**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ పార్వతీ రాజన్న దేవస్థానం నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) గా రమాదేవి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంలో ఆలయ ఉద్యోగులు ఆమెను ఘనంగా శాలువాతో సన్మానించారు. అలాగే, సిబ్బంది నూతన ఈఓ కు శుభాకాంక్షలు తెలిపి, ఆలయ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# వేములవాడ రాజన్న సేవలో మహిళా ఐఏఎస్ అధికారులు

**– సీతాలక్ష్మి,కాత్యాయని దేవి ప్రత్యేక పూజలు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఇద్దరు ఐఏఎస్ స్థాయి మహిళా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. మొదట రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కమిషనర్ సీతాలక్ష్మి ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహక అధికారి (ఈవో) రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందించారు. సీతాలక్ష్మితో పాటు ప్రోటోకాల్ సహాయక నిర్వహణ అధికారి జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నూగూరు నరేందర్, జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు,ఆలయ సిబ్బంది ఉన్నారు. తరువాత సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ (సెర్ప్) అడిషనల్ సీఈవో,కాత్యాయని దేవి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, నూగూరి నరేందర్, ప్రోటోకాల్ జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు,సిబ్బంది ఉన్నారు.



# రేపే ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

**– వేములవాడ మాతృశ్రీ హాస్పిటల్‌లో ఏర్పాట్లు - లయన్స్ క్లబ్**




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ఆధ్వర్యంలో, రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ నెల 8వ తేదీ సోమవారం ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు వేములవాడ పట్టణంలోని మాతృశ్రీ హాస్పిటల్‌లో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు శిబిరం కొనసాగుతుంది.

### ఆపరేషన్‌కు అవసరమైన పత్రాలు

ఆపరేషన్ చేయించుకోవాలనుకునే వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు వెంట తీసుకురావాలి. రక్త పరీక్ష కోసం రూ. 220 చెల్లించాలి. అలాగే తినడానికి ఒక ప్లేట్, గ్లాస్, రెండు దుప్పట్లు తీసుకురావాలి. పాల్గొనే వారికి ఉచిత భోజన వసతి కల్పించబడుతుంది.

### ఉచిత బస్సు సౌకర్యం - మందులు, కంటి అద్దాలు

ఆపరేషన్ చేయించుకునే వారిని వేములవాడ నుంచి రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత బస్సులో తరలించి, మళ్లీ తీసుకురావడం జరుగుతుంది. శస్త్రచికిత్స అనంతరం ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందిస్తారు.

### లయన్స్ క్లబ్ అధ్యక్షుడి విజ్ఞప్తి

ఈ శిబిరాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్ కోరారు. కావలసిన పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలి అని తెలిపారు.

### పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

- డాక్టర్ సంతోష్ కుమార్ - 90003 02223
- లయన్ బచ్చు వంశీకృష్ణ - 91776 81744
- లయన్ డాక్టర్ కోయినేని ప్రవీణ్ - 97044 28009

# వేములవాడలో నేటి మిలాద్ ఉన్ నబీ శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి

**– శోభాయాత్రను విజయవంతం చేయాలి**

**– వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షులు : మొహమ్మద్ అక్రం**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నేడు ఆదివారం శోభాయాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ అక్రం తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ – "తిప్పాపూర్ నుండి ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభమై, కోరుట్ల బస్టాండ్ వరకు కొనసాగుతుంది. అనంతరం అర్బన్ కాలనీ మదీనా మసీద్ వద్ద ర్యాలీ ముగుస్తుంది" అని వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యువకులు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. శోభాయాత్ర విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ?

# మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవాస్ఫూర్తితో వొడ్యాల శివాంష్ జన్మదిన వేడుకలు

**– విద్యాభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్ష...! ఆశీస్సులు...!!**

**– మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు : డాక్టర్ మధు మహేష్**





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు వొడ్యాల వేణు – హరిత దంపతుల కుమారుడు వొడ్యాల శివాంష్ జన్మదిన వేడుకలు శనివారం సాంప్రదాయబద్ధంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అర్చన చేస్తూ, హారతులు సమర్పించారు. దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనాలు అందించి, శివాంష్‌కు ఆయురారోగ్యాలు, విద్యాభివృద్ధి కలగాలని ప్రార్థనలు చేశారు. తరువాత "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్"ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. శివాంష్ చేత కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచి, పాల్గొన్న వారందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నార్థులకు,యాచకులకు,భక్తులకు అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ మాట్లాడుతూ "పిల్లల భవిష్యత్తు బలపడాలంటే వారి మనసులో మంచి విలువలు, భక్తి భావాలు నింపడం అవసరం. ఈ రోజుల్లో చిన్నారుల జన్మదిన వేడుకలను ఆలయ దర్శనంతో ప్రారంభించడం ఒక మంచి సంప్రదాయం. ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడమే మా ట్రస్ట్ లక్ష్యం" అని తెలిపారు. వారు ఇంకా పేర్కొంటూ %-% "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. భవిష్యత్తులో విద్యా రంగంలో వెనుకబడిన విద్యార్థులకు సహాయం అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం" అన్నారు. వేడుకలో పలువురు స్థానిక ప్రముఖులు, పాత్రికేయులు, స్నేహితులు,ట్రస్ట్ సభ్యులు పాల్గొని శివాంష్‌కు ఆశీర్వాదాలు అందించారు. రాజన్న దివ్యకృపతో విద్యా, జీవనవిజయంలో విజయపథంలో కొనసాగాలని ఆకాంక్షించి, ఆశీస్సులు అందించారు.

# గణనాధుని లడ్డును 2లక్షల 45వేలకు దక్కించుకున్న యశ్వంత్

**– విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో అందరూ సంతోషంగా ఉండాలి**



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలో పటేల్ నగర్ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుని సాగర్ తీరానికై బయలుదేరిన గణనాధుని లడ్డు వేలం పాటలో అంబర్ పేట బిజెపి పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ యశ్వంత్ 2,45,000 వేలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ పటేల్ నగర్ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, విగ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో లడ్డూను దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని యశ్వంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బిక్షపతి, మరియు దేవస్థాన కమిటీ సభ్యులు యాదగిరి, రత్నపాని, నాగరాజ్, అనిల్, మరియు దేవస్థాన కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**– జర్నలిస్ట్ డే సందర్భంగా సన్మానం**



**హుజూర్ నగర్ (ప్రశ్న న్యూస్)** సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమైందని వాసవి వనిత వాసవి క్లబ్ నాయకులు వెంపటి వెంకటేశ్వరరావు, ఓరుగంటి నాగేశ్వరరావు, పలిశెట్టి నరసింహారావు, దాసరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం జర్నలిస్టుల డే సందర్భంగా స్థానిక వాసవి భవనంలో జర్నలిస్టులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్న జర్నలిస్టులకు కృషి మరువలేని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టు లో ఇంకా చైతన్యవంతంగా ఉన్నారని వారి ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తున్నాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు బచ్చు రామారావు, పేరూరి అశోక్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మురళి, జర్నలిస్టులు కోల నాగేశ్వరరావు, పిల్లలమర్రి శ్రీనివాస్, దేనుమకొండ శేషం రాజు ,ఉషశ్రీ ,రాంప్రసాద్, శ్రీనివాస చారి, ఓగ్గు విశాఖ, వెంకటేష్, ఇందిరాల రామకృష్ణ ,అంజి ,బండి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో రైతులు ఎవరూ ఇబ్బంది పడకూడదు

**– రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం పని చేస్తోంది**

**– రుద్రవరం సింగిల్విండో చైర్మన్ : రేగులపాటి కృష్ణదేవ రావు**






**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం సొసైటీ పరిధిలో ఉన్న రైతులకు సరిపడా యూరియా ఎరువు బస్తాలు అందుబాటులో ఉంచామని సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %-%ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో "ప్రస్తుతం రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా యూరియా అందుబాటులో ఉంది. సొసైటీ గోదాములో సరిపడా నిల్వ కల్పించాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎవరూ అదనంగా డబ్బులు వసూలు చేయరాదు. ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం మాత్రమే ఎరువులు పంపిణీ చేస్తాం. రైతులు ముందుగా టోకెన్లు తీసుకొని, క్రమబద్ధంగా ఎరువులు తీసుకోవాలి. ఎవరైనా అక్రమంగా అమ్మకాలు చేస్తే, కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని కృష్ణదేవరావు అన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ మెంబర్



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా జగిత్యాలలో వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కౌన్సిల్ మెంబర్ సంజయ్ రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

- ట్రేడ్ లైసెన్స్ లేకుండానే పుట్టగొడుగుల్లా దుకాణాలు
- మేడ్చల్ పురపాలక సంఘం అధికారులకు పట్టింపు లేదా.?
- ప్రజా ప్రభుత్వంలో ప్రజల రక్షణపై నిర్లక్ష్యమా.?
- సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరి




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ప్రజా ప్రభుత్వంలో అధికారుల ఉదాసీనతతో సర్కారు ఆదాయానికి భారీగా గండి పడుతోంది. మేడ్చల్ పురపాలక సంఘం పరిధి రోజురోజుకూ విస్తరిస్తున్న సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మేడ్చల్ పురపాలక సంఘం అతి త్వరగా విస్తరిస్తుంది. ఈ నేపథ్యంలో మేడ్చల్ అభివృద్ధికి, ప్రజల భద్రతకు సంబంధించి అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. మేడ్చల్ పురపాలక సంఘం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విషయాలపై దృష్టి సారించి వచ్చిన ఆదాయం మేడ్చల్ పురపాలక సంఘం అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ మేడ్చల్ పురపాలక సంఘం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కమిషనర్, అధికారులు తమకేవి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని సంబంధిత కార్యాలయ సిబ్బంది సమాచారం ఇస్తూ ఆరోపించడం విశేషం. ట్రేడ్ లైసెన్సుల విషయంలో సంబంధిత శాఖ వారు కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలన కూడా చేయడం లేదని, అనుమతులు లేని స్టిల్ట్ లో నిబంధనలు తుంగలో తొక్కి ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడంతో పాటు చాలావరకు ట్రేడ్ లైసన్ లేని వ్యాపారాలు జరుగుతున్నాయని దీనితో భారీగా మున్సిపల్ ఆదాయానికి గండిపడుతున్న కమిషనర్ అధికారులు పట్టించుకోకపోవడం వెనక భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారస్తులకు మున్సిపల్ అధికారులకు అంతర్గత ఒప్పందాలతో రెడ్ లైసెన్ జారీ చేయకుండా నెల నెల వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

### ఫీల్డ్ లెవల్ ఇన్స్పెక్షన్స్ మరిచారా.?

రోడ్డుపైన నెలకొల్పే ప్రతి చిన్న వ్యాపార సముదాయం నుంచి అతి పెద్ద కార్యాలయం వరకు ప్రతి కమర్షియల్ వ్యాపారానికి సంబంధించి సంబంధితఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్ ఇవ్వాలి. ట్రేడ్ లైసెన్స్ లేకపోతే దుకాణదారులు ఎవరూ కూడా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించకూడదు. కానీ ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చాలా వ్యాపార సముదాయాలకు అసలు ట్రేడ్ లైసెన్స్ లేని సంగతి పరిశీలనలో తేలింది.

ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ వారు ఎందుకు ఇన్స్పెక్షన్ చేయడం లేదు. ఫైన్లు ఎందుకు విధించడం లేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. దుకాణాదారుల వద్ద నుంచి ట్రేడ్ లైసెన్స్ జారీకి ఫీజు వసూలు చేయడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మేడ్చల్ పురపాలక సంఘం కార్యాలయానికి రావలసిన భారీగా ఆదాయాన్ని సమకూర్చే ఈ విషయం పట్ల పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు ఎందుకు ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్నారనేది అతి పెద్ద ప్రశ్నగా మారింది.

### ప్రజల సం'రక్షణ' భద్రతపై ప్రశ్నలు

మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని ఎలాంటి అనుమతి తీసుకోకుండా వ్యాపారాలు చేస్తున్న వారిపైన చర్యలకు కమిషనర్, సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది ఎందుకు జంకుతున్నారని మేడ్చల్ పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. చిన్న స్థాయి దుకాణం నుంచి అతి పెద్ద కాంప్లెక్స్ వరకు పర్మిషన్స్ లేని వారిపై ఎందుకు స్పెషల్ డ్రైవ్స్ చేపట్టడం లేదని అడుగుతున్నారు. రూల్స్ వాళ్లకు వర్తింపజేయకుండా ఉండటంలో ఆంతర్యమేంటి, అసలు మర్మమేంటో తెలియడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, ఇష్టారీతిన ఎలాంటి అనుమతులు(ట్రేడ్ లైసెన్స్, ఎన్వోసీ ఇతర పర్మిషన్స్) లేకుండానే మరింత విచ్చలవిడిగా మేడ్చల్ పట్టణంలో పుట్టగొడుగుల్లా దుకాణాలు వ్యాపార సముదాయాలు వెలుస్తాయని పేర్కొంటున్నారు. ఇక వ్యాపార కార్యకలాపాలు ఇష్టారాజ్యంగా సాగుతాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ ఉండబోదని, ఆరోగ్యం విషయమై కనీసంగా ప్రమాణాలు పాటించరని, నియంత్రణ అనేది ఇక ఉండబోదని హెచ్చరిస్తున్నారు. వ్యాపార సముదాయాల్లో ఏవైనా ప్రమాదాలు జరిగినా, ఫుడ్ సంబంధిత దుకాణాల్లో ఎలాంటి తయారీ తేదీ లేని ఎక్స్పైర్ తేదీ ముగిసిన తినుబండారాలు విక్రయిస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచినట్టే కదా.? ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో ఎవరు బాధ్యత వహిస్తున్నారని బుద్ధిజీవులు కొందరు అడుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ఈ విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పని చేసేలా ఆదేశాలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.

# సీఎంపై వ్యక్తిగత దూషణలకు పాల్పడిన బీఆర్ఎస్ కార్యకర్త

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు
- ఇప్పటికే మూడు సార్లు యూరియా తీసుకెళ్లి ఇష్టారీతిన ఆరోపణల
- జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం



**సిరిసిల్ల( ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన యూరియా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ మూడు సార్లు తీసుకెళ్లి ఇష్టారీతిన ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వాఖ్యలు, వ్యక్తిగత దూషణలు చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు గురువారం ఎస్సై రాహుల్ రెడ్డికి ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో గోదాం వద్ద యూరియా కోసం వచ్చిన రైతుల సమక్షంలోనే అందరూ చూస్తుండగానే ఎల్లారెడ్డిపేట బీ ఆర్ఎస్ పార్టీ కార్యకర్త మానుక లక్ష్మణ్ యాదవ్ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తన కాలికి తొడిగిన చెప్పును ఎత్తి చూపుతూ వ్యక్తి గత దూషణలకు దిగాడని, అతడిపై విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన చేసిన ఫిర్యాదులో తెలిపారు. ఆయన సీఎంను దూషించిన ఆడియో వీడియో రికార్డులను ఫోటోలను పోలీసులకు ఆయన అందజేశారని, ఎల్లారెడ్డిపేట పోలీసులు లక్ష్మణ్ యాదవ్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానుక లక్ష్మణ్ యాదవ్ ఇప్పటికే మూడు సార్లు యూరియా తీసుకెళ్లారని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం స్పష్టం చేశారు. యూరియా తీసుకెళ్తూ ఇలా ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేయడం సరికాదని అన్నారు.

# రైతన్నలకు యూరియా కొరతతో తప్పని తిప్పలు

- తెల్లవారుజాము నుంచే రైతన్నలు సహకార సంఘాలు, దుకాణాల వద్ద బారులు
- ఎండ తీవ్రత తట్టుకోలేక పడిపోతున్న రైతులు




**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** రైతుల సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన గొప్ప మాటలు చేతులలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. జగిత్యాల జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాల్లో, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యూరియా బస్తాల కోసం తెల్లవారుజాము నుంచే రైతులు సహకార సంఘాలు, దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు,ఎండ తీవ్రత తట్టుకోలేక చెప్పులు, రాళ్లు, చెట్ల కొమ్మలు వంటివి లైన్లలో ఉంచి తమ వంతు కోసం వేచి ఉండాల్సిన అద్వాన్న పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల యూరియా నిల్వలు లేవని అధికారులు కేంద్రాలకు తాళం వేసిన సంఘటనలు కూడా జరుగుతున్నాయి. ఇది రైతుల ఆందోళనను మరింత పెంచుతోంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు తీర్చడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

### తీవ్రంగా యూరియా కొరత

జగిత్యాలతో సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యూరియా సరఫరా సరిపోక, రైతులు ఆందోళనకు గురవుతున్నారు అన్నదాతలను ప్రభుత్వం ఇలా సహాయం చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నదాతలు పండించడం మానేస్తే ప్రజలు బతకడం ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి మంత్రులకు ముందు చూపు లేక సరైన సమయంలో రైతులకు యూరియా అందించడం లేదని మంత్రులు ముఖ్యమంత్రి వాళ్ళ అభివృద్ధి తప్ప రైతుల కష్టాలు పట్టించుకోవడంలేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గేమ్ ఆడుతూ రైతులను నట్టేటము చేస్తున్నాయి రైతులు పంటలు పండించకుంటే భవిష్యత్తులో బియ్యం ధరలు ఇతర ధాన్యాల ధరలో అధికంగా పెరిగే ప్రజలు బ్రతికే పరిస్థితి జటిలమవుతుంది పాలకులు దీనిని అర్థం చేసుకోకపోవడం విడ్డూరంగా మారింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు కావలసిన యూరియాను యుద్ధ ప్రతిపదికన అందించాలని యావత్ తెలంగాణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆ హామీని నిలబెట్టుకోలేకపోయా

- ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తాను ఇచ్చిన ఒక కీలక ఎన్నికల హామీని నెరవేర్చడంలో విఫలమయ్యానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా అంగీకరించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపలేకపోయానని, అది తాను ఎదుర్కొన్న సమస్యల్లోకెల్లా అత్యంత కఠినమైనదని ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లోని రోజ్ గార్డెన్‌లో కాంగ్రెస్ సభ్యులతో ఏర్పాటు చేసిన విందు సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో తనకు సత్సంబంధాలు ఉండటం వల్ల ఈ యుద్ధాన్ని చాలా సులభంగా ఆపగలనని మొదట భావించానని, కానీ అది జరగలేదని అన్నారు. "నేను ఎన్నో యుద్ధాలను ఆపాను. కానీ అన్నింటికంటే సులభం అనుకున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధమే అత్యంత కఠినమైనదిగా మిగిలిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు.
తాను అధికారంలోకి వచ్చాక ఏడు సుదీర్ఘ యుద్ధాలను ఆపానని తెలిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న కొన్ని అంతర్జాతీయ వివాదాలను కేవలం గంటల వ్యవధిలోనే పరిష్కరించగలిగానని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పారు. కానీ ఉక్రెయిన్ విషయంలో మాత్రం ఆశించిన ఫలితం రాలేదని వివరించారు. గత ఏడు నెలల కాలంలో తాను చేసినంతగా ఎవరూ చేయలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. 31 ఏళ్లుగా కొనసాగుతున్న ఒక ఘర్షణ ముగియడం అసాధ్యమని అందరూ భావించారని, కానీ తాను రెండు గంటల్లో ముగించానని అన్నారు. కాగా, తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే కేవలం 24 గంటల్లోనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని ట్రంప్ తన ప్రచారంలో పదేపదే హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, అధికారం చేపట్టినా ఈ విషయంలో చెప్పుకోదగ్గ పురోగతి కనిపించలేదు. ఇటీవలే ఆగస్టులో చరిత్రాత్మక అలస్కా సదస్సులో ఇరు పక్షాలతో చర్చలు జరిపినా, ఎలాంటి అధికారిక ఒప్పందం కుదరకపోవడం గమనార్హం.

# త్వరలోనే భారత్‌కు నీరవ్ మోదీ, మాల్యా

- తీహార్ జైలును పరిశీలించిన బ్రిటన్ బృందం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్లను దేశానికి రప్పించే ప్రయత్నాలను భారత్ ముమ్మరం చేసింది. ముఖ్యంగా విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటి వారి అప్పగింత ప్రక్రియను వేగవంతం చేసేందుకు సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. అవసరమైతే ఢిల్లీలోని తీహార్ జైలులోనే వారికోసం అత్యంత భద్రతతో కూడిన 'ప్రత్యేక ఎన్‌క్లేవ్' (ప్రత్యేక విభాగం) నిర్మిస్తామని యూకే అధికారులకు హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే బ్రిటన్‌కు చెందిన క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ (సీపీఎస్) బృందం ఇటీవల తీహార్ జైలును సందర్శించి ఇక్కడి పరిస్థితులను పరిశీలించింది. భారత జైళ్లలో సరైన వసతులు, భద్రత ఉండవని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని గతంలో యూకే కోర్టులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇదే కారణంగా నిందితుల అప్పగింత అభ్యర్థనలను తిరస్కరించిన సందర్భాలు ఉన్నాయి. ఈ అడ్డంకిని తొలగించేందుకే భారత అధికారులు ఈ కొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చారు. తీహార్ జైలు సందర్శనకు వచ్చిన యూకే బృందం ఇక్కడి హై-సెక్యూరిటీ వార్డును క్షుణ్ణంగా పరిశీలించి, కొందరు ఖైదీలతో కూడా మాట్లాడినట్లు సమాచారం. అప్పగింత ఒప్పందం కింద భారత్‌కు తీసుకొచ్చే నేరగాళ్ల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, వారికి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భారత అధికారులు స్పష్టం చేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని, న్యాయమైన విచారణ జరుపుతామని యూకే బృందానికి భరోసా ఇచ్చారు. ఈ చర్యల ద్వారా యూకే కోర్టుల సందేహాలను నివృత్తి చేసి, అప్పగింత ప్రక్రియను సాఫీగా ముందుకు తీసుకెళ్లవచ్చని భారత్ ఆశిస్తోంది. ప్రస్తుతం భారత్ తరఫున వివిధ దేశాల్లో సుమారు 178 అప్పగింత అభ్యర్థనలు పెండింగ్‌లో ఉండగా, వాటిలో దాదాపు 20 ఒక్క యూకేలోనే ఉన్నాయి. వీటిలో విజయ్ మాల్యా, నీరవ్ మోదీ కేసులే అత్యంత కీలకమైనవి. కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా సుమారు రూ. 9,000 కోట్లు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు సంబంధించి రూ. 13,800 కోట్ల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరిద్దరి అప్పగింతకు యూకే కోర్టులు అంగీకరించినప్పటికీ, కొన్ని న్యాయపరమైన కారణాలతో ప్రక్రియ ఆలస్యమవుతోంది.

# టీపీసీసీ చీఫ్‌గా ఏడాది పూర్తి చేసుకున్న మహేశ్ కుమార్ గౌడ్

- మహేశ్ కుమార్ గౌడ్‌ను అభినందించిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్‌ను రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న మహేశ్ కుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు అభినందనలు తెలిపారు. మున్ముందు ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588